

స్పైసీగా..

ఆతిథ్యానికి పెట్టింది పేరు పశ్చిమ. రకరకాల రుచులు గోదావరి జిల్లా సొంతం. ఇప్పుడు రెస్టారెంట్ కల్చర్ పెరిగింది. ఊరూరా హైదరాబాద్ దమ్మ్ బిరియాని సహా వెరైటీ నాన్ వెజ్ రుచులన్నీ ఇక్కడే స్పైసీగా దొరుకుతున్నాయి. వాటిని మీరు ఆస్వాదించండి.. 6లో..



వెయ్యేళ్ల గోపురం

ఈ ఆలయ గోపురం వయసు వెయ్యేళ్లు. అపురూపమైన చిత్ర, శిల్ప కళల సంపదకు సజీవ సాక్ష్యం. ఇసుక, రాతి శిలతో నిర్మితమైన ఈ గాలి గోపురంపై రమణీయ శిల్పాలు నాటి చారిత్రక వైభవానికి నిదర్శనం. ఇది ఎక్కడో తెలుసా ? 6లో..



అంత స్పీడెందుకు ?

అది మలుపు.. ఎవరైనా ఏం చేస్తారు ? స్పీడు తగ్గించి స్లోగా వెళతారు. కాని, హైదరాబాద్ నుంచి ఏలూరు వెళుతున్న ఆర్టీసీ సూపర్ లగ్జరీ బస్సును డ్రైవర్ స్పీడుగా నడిపాడు. ఒక్కసారిగా బోల్తాపడి కొంత దూరం ఈడ్చుకుపోయింది. ఆ సమయంలో బస్సులో 36 మంది ప్రయాణికులు ఉండగా.. ఒకరు మృతి చెందారు. 17 మంది గాయపడ్డారు. 7లో..



ఈ ఆత్మహత్యలకు.. కారణాలేమిటంటే..

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురు వ్యక్తులు సోమవారం ఆత్మహత్య చేసుకున్నారు. చిన్న చిన్న కారణలతోనే వీరు అఘాయిత్యాలకు పాల్పడ్డారు. బైక్ కొనివ్వలేదని యువకుడు, పిల్లలకు పెళ్లిళ్లు కావడం లేదని తల్లి, మద్యం తాగొద్దని తిట్టారని ఓ వ్యక్తి బలవన్మరణాలకు పాల్పడ్డారు. 7లో..

బకసంహారం అలంకారంలో శ్రీవారు

ద్వారకాతిరుమల, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): బక సంహారం అలంకారంలో చినతిరుమలేశుడు సోమ వారం భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీవారి ఆశ్వయుజ మాస దివ్యబ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారు ఆలయ ముఖ మండపంలో



రోజుకో అలంకారంలో భక్తులను కటాక్షిస్తున్నారు. కొంగ రూపంలో వచ్చిన బకుడనే రాక్షసుడ్ని కడచేర్చే శ్రీకృష్ణునిగా బకసంహారం అలంకారంలో స్వామివారు భక్తులకు కనువిందు చేశారు. ఆలయాన్ని, పరిసరాలను విద్యుద్దీప తోరణాలతో శోభాయమానంగా అలంకరించారు.



కొత్త వాళ్లకే కిక్

పాత సిండికేట్‌లకు భారీ షాక్

- లాటరీలో 13 దుకాణాలు మహిళల సొంతం
- అన్ని నియోజకవర్గాల్లోను అంచనాలన్నీ తల్లకిందులు
- కోట్ల రూపాయలు నష్టపోయిన వారెందరో
- ఎమ్మెల్యేలు, అనుకూలురుకు కేవలం ఒకట్రెండు దుకాణాలే సొంతం
- అయినా కొత్త ముఖాలతో రాయబారాలు
- రేపటి నుంచి కొత్త షాపుల్లోనే మద్యం విక్రయాలు

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి) :

మద్యం దుకాణాల లాటరీ ప్రక్రియ సోమవారంతో పూర్తయ్యింది. అనేక దుకాణాలకు డజన్ల సంఖ్యలో దరఖాస్తులు చేసినా ఏ ఒక్క దుకాణం లభించక కొన్ని సిండికేట్‌లు బావురమన్నాయి. ఇంకొన్ని చోట్ల ఒకటి, రెండు దుకాణాలే దక్కి కెవ్వుమనిపించాయి. మద్యం దుకాణాల్లో ఈసారి అనూహ్యంగా పాత సిండికేట్‌లను తలదన్నే విధంగా కొత్త ముఖాలు దరఖాస్తుల రూపంలో ఎగబడ్డారు. అదేమి విచిత్రమో లాటరీలో వీరిలో అత్యధికంగా కొత్త ముఖాలకే దుకాణం పేరిట అదృష్టం వరించింది. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో తమ గ్రూపుకు ఒకటి, రెండు దుకాణాలు దక్కడం ఖాయమని ధీమాకు పోయిన వారంతా వెల్లికిలా పడ్డారు. పోతే రెండు లక్షలు.. వస్తే అదృష్టం అనే సెంటిమెంట్‌తో రంగంలోకి దిగి సింగిల్ దరఖాస్తు చేసిన వారిలో కూడా డజన్ల సంఖ్యలోనే అలవోకగా దుకాణాలు తన్నుకుపోయి మిగతా వారిని బిత్తరపోయేలా చేశారు. ఈసారి 13 మద్యం దుకాణాలు మహిళల సొంతమయ్యాయి. బుధవారం నుంచే కొత్త మద్యం దుకాణాల్లో అమ్మకాలు ఆరంభమవుతాయి.

దిమ్మ తిరిగేలా లాటరీ

జిల్లావ్యాప్తంగా 144 మద్యం దుకాణాలకు 5,499 దరఖాస్తులు వచ్చాయి. సోమవారం ఏలూరులో మినీబైపాస్‌లోని చలసాని గార్డెన్స్ ప్రాంగణంలో కలెక్టర్ వెట్రిసెల్వి ఆధ్వర్యంలో లాటరీ నిర్వహించారు. ఉదయం 8 గంటల నుంచే ఈ ప్రక్రియ ఆరంభమై సాయంత్రం 4 గంటలతో ముగిసింది. ఎనిమిది గంటల సుదీర్ఘ నిరీక్షణలో ముఖాలు వాడిపోయిన వారు కొందరైతే అదృష్టం వరించిందన్న ఆనందంతో కేరింతలు కొట్టినవారు ఇంకొందరు. ఎక్సైజ్ సర్కిళ్ల వారీగా లాటరీ కొనసాగుతుండగా ఏలూరు నగరంలో తొలి దుకాణం కార్పొరేటర్ పప్పు ఉమామహేశ్వర రావు పరమైంది. అక్కడి నుంచి వరుసగా ఏలూరు నగరంలోని దుకాణాలన్నీ కొత్త ముఖాల సొంతమవుతూ వచ్చాయి. మద్యం వ్యాపారంతో ఇంతకుముందు ఎలాంటి సంబంధంలేని వ్యక్తులు కేవలం స్నేహపూర్వకంగా పదిమంది కలిసి దరఖాస్తు చేసుకోగా, వారిలో ఒకరికి లాటరీ రూపంలో దుకాణం దక్కింది. వరుసగా ఇదే పద్ధతిలో దుకాణాలు కొత్త ముఖాలవైపు వెళ్తుండడంతో సీనియర్లంతా నోరెళ్ళబెట్టారు. ప్రత్యేకించి ఏలూరు నగరంలో సజ్జల శ్రీకాంత్‌రెడ్డి అనే వ్యక్తికి నాలుగు దుకాణాలు సొంతమయ్యాయి. మరెక్కడా లేని విధంగా నాలుగు దుకాణాలు ఒకే దగ్గర సొంతంకావడం ఒక రికార్డు. ఏజెన్సీ ప్రాంతంతో సహా నూజివీడు, ఏలూరుతోపాటు మిగిలిన ప్రాంతాల్లోను సిండికేట్‌లుగా ఏర్పడిన వారంతా దుకాణాల కోసం దరఖాస్తు చేశారు. కైకలూరులో కొంతమంది సిండికేట్‌గా ఏర్పడి ఒక్క దుకాణమైనా రాకపోతుందా అని ఆశతో దరఖాస్తు చేసినా చివరకు వారి శ్రమ ఫలించకపోగా దరఖాస్తు రుసుమంతా గల్లంతైంది. నూజివీడు నియోజకవర్గంలో మంత్రి కొలుసు పార్థసారథి అనుకూలురు అందరి మాదిరిగానే దరఖాస్తు చేసుకోగా వారిలో అత్యధికులకు అదృష్టం వరించింది. ఈ పరిణామంతో మంత్రి శిబిరంలో కొంత సంతృప్తి వ్యక్తమైంది. నూజివీడు పట్టణంతో సహా రూరల్ ప్రాంతాల్లోను లాటరీలో వీరికే దుకాణాలు దక్కడం మిగతావారంతా డీలా పడ్డారు. పోలవరం, చింతలపూడి నియోజక వర్గాలు రెండింటిలోను దరఖాస్తులు వెల్లువలా వచ్చి పడినా సిండికేట్‌లకు

(మిగతా 8వ పేజీలో)



లాటరీ ప్రక్రియకు హాజరైన దరఖాస్తుదారులు





లక్కీడ్రా తీసి టెండర్లు వేసిన వారికి నంబర్‌ను చూపుతున్న కలెక్టర్ వెట్రిసెల్వి, జేసీ ధాత్రిరెడ్డి

బుధవారం నుంచే అదుర్స్

కొత్త మద్యం దుకాణాలు బుధవారం నుంచి వ్యాపారం ఆరంభించబోతున్నాయి. నేటి నుంచే కొత్త మద్యం దుకాణదారు లందరికీ కావాల్సినంత మేర సరుకు అందించేందుకు ఎక్సైజ్ శాఖ అన్ని ఏర్పాట్లు చేసింది. ప్రతీ దుకాణానికి అన్ని రకాల బ్రాండ్‌లను ముందుగా అందించాలని లక్ష్యంగా నిర్ణయించుకున్నారు. ప్రస్తుతం ప్రభుత్వ దుకాణాలన్నీ మంగళవారం సాయంత్రంతో మూతపడతాయి. కొత్తగా 144 దుకాణాలు ఆయా ప్రాంతాల్లో మద్యం విక్రయాలకు తెరలేపనున్నాయి.

ఆడోళ్లు తగ్గలేదు..

మద్యం వ్యాపారం అంటేనే అల్లంత దూరంగా ఉండే మహిళలు కూడా ఈసారి లాటరీలో పాల్గొన్నారు. ఏకంగా 13 దుకాణాలు వీరి సొంతమయ్యాయి. మద్యం వ్యాపారం అంటేనే సాధారణంగా మహిళలు చీదరించుకుంటారు. అలాంటిది జిల్లాలో సోమవారం లాటరీ పద్ధతిలో 13 దుకాణాలు మహిళల పేరిట సొంతమయ్యాయి. ఏలూరు, పోలవరంలలో రెండేసి చొప్పున, చింతలపూడి, కామవరపుకోట, లింగపాలెం, ద్వారకాతిరుమల, ముసునూరు, కుక్కునూరు, నూజివీడు, జీలుగుమిల్లి మండలాల్లో ఒక్కొక్కటి చొప్పున మద్యం దుకాణాలు మహిళలకే దక్కాయి. ఈసారి మద్యం దుకాణం దక్కడమే మహద్భాగ్యంగా భావించి పెద్ద ఎత్తున సిండికేట్‌లు దరఖాస్తులు చేయగా మహిళల పేరిట కొందరు వ్యక్తిగతంగానే దరఖాస్తు చేసి దక్కించుకోవడం విశేషం.



లక్కీ డ్రాకు చిన్నారితో వచ్చిన మహిళ



జీలుగుమిల్లిలో వర్షం

భయపెడుతున్న అల్పపీడనం

- మూడు రోజులపాటు వర్షాలంటూ హెచ్చరికలు
- విద్యుత్ శాఖ అప్రమత్తం.. కంట్రోల్ రూం ఏర్పాటు

ఏలూరు సిటీ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్ప పీడనం కారణంగా కోస్తా జిల్లాలో మూడు రోజులపాటు(ఈ నెల 15 నుంచి 17వతేదీ వరకు) వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ పేర్కొంది. ఇప్పటికే ఆగ్నేయ బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. ఈ అల్పపీడనం కారణంగా పిడుగులు, గాలులతో కూడిన వర్షాలు కురుస్తాయని విపత్తుల నిర్వహణ శాఖ ముందస్తు హెచ్చరికలు జారీ చేసింది. జిల్లాలో ఈ ఏడాది సార్వా సాగు 2.11 లక్షల ఎకరాల్లో జరగ్గా, ఇందులో ప్రధానంగా వరి సాగు 1.91 లక్షల ఎకరాల్లో సాగిం ది. భారీగా వర్షాలు కురిస్తే చేతికి వచ్చిన పంట దక్కే అవకాశం ఉండదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వరికోతలు మొదలైన ప్రాంతాల్లో కోసిన వరి ధాన్యాన్ని బరకాలు కప్పి జాగ్రత్త పరుచుకుంటున్నారు. అల్పపీడనం నేపథ్యంలో విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బందిని అప్రమత్తం చేసినట్టు ఏలూరు సర్కిల్ విద్యుత్ శాఖ ఎస్ఈ పిసాల్మన్ రాజు తెలిపారు. ఏలూరులోని జిల్లా విద్యుత్ శాఖ కార్యాలయంలో 94409 02926 నంబర్‌తో 24 గంటలపాటు మూడు షిఫ్టులలో పనిచేసే విధంగా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు. వర్షాల కారణంగా ఏదైనా విద్యుత్ అంతరాయాలు ఏర్పడినా లేదా సమస్యలు తలెత్తినా దగ్గరలో ఉన్న విద్యుత్ సెక్షన్ కార్యాలయానికి, టోల్ ఫ్రీ నెంబరు 1912 కు, కంట్రోల్‌రూమ్ సర్కిల్ కార్యాలయానికి గాని ఫోన్ చేసి ఫిర్యాదు చేస్తే వెంటనే పరిష్కరిస్తారన్నారు.

నగర పాలక సంస్థ కార్యాలయంలో కంట్రోల్ రూమ్

ఏలూరు టూటౌన్ : రాబోయే రెండు రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ఏలూరు నగరపాలక సంస్థ పరిధిలో ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా తగు సహాయం నిమిత్తం నగర పాలక సంస్థ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్టు కమిషనర్ భాను ప్రతాప్ తెలిపారు. ప్రజలు సహాయం కోసం 08812-232101, 08812 222200 టోల్‌ఫ్రీ నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

బస్సులన్నీ ఫుల్..



దసరా పండుగకు దూర ప్రాంతాల నుంచి స్వగ్రామాలకు వచ్చిన వారు, బంధువుల ఇళ్లకు వచ్చిన వాళ్లు, దూర ప్రాంతాల్లో చదువుతున్న విద్యార్థులు తిరుగుముఖం పట్టడంతో సోమవారం ఆర్టీసీ బస్టాండ్ కిటకిటలాడింది. మరోవైపు విద్యాసంస్థలు తెరవడంతో ఏ బస్సు వచ్చిన నిమిషంలో నిండిపోయింది.

- ఫొటో గ్రాఫర్, ఏలూరు











నేడు వైద్య విద్యార్థుల 12 గంటల ఉపవాస దీక్ష

ఏలూరు అర్బన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : కోల్‌కతా ఆర్‌జీ కర్ ఆసుపత్రిలో ఇటీవల హత్యాచారానికి గురైన పీజీ వైద్య విద్యార్థిని (పీజీటీ) దుస్సంఘటనకు కారకులపై ప్రభుత్వం ఇంతవరకు ఏచర్యలు చేపట్టకపోవడాన్ని నిరసిస్తూ దేశవ్యాప్తంగా మంగళవారం అన్ని ప్రభుత్వ, ప్రైవేటు వైద్యకళాశాలల్లో జూనియర్ వైద్యులు, పీజీ రెసిడెంట్ వైద్య విద్యార్థులు, ఎంబీబీఎస్ చదువుతున్న విద్యార్థులు ఉదయం 6గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు ఉపవాస దీక్షలు నిర్వహించడానికి ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) పిలుపు నిచ్చింది. ఈ వివరాలను ఐఎంఏ అనుబంధ ఇండియన్ హాస్పిటల్స్ బోర్డు (హెచ్‌బీఐ) జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాసరాజు స్థానిక పత్రికలకు తెలిపారు. వైద్యురాలి కుటుంబానికి న్యాయం చేయాలని నెలలుగా ఐఎంఏ డిమాండ్ చేస్తున్నప్పటికీ ఇటు కేంద్రప్రభుత్వంలో గాని, అటు పశ్చిమ బెంగాల్ రాష్ట్ర ప్రభుత్వంలో గాని చలనం లేదని ఆరోపించారు. దేశవ్యాప్తంగా వైద్య కళాశాలల్లో అవినీతి విధానాలను అరికట్టాలని, రెసిడెంట్ వైద్యులపై వేధింపులను ఆపాలని, రోజుకి గరిష్ఠంగా 8 గంటల డ్యూటీ, వారానికో రోజు సెలవు, పారితోషకం చెల్లింపుల్లో సమానత్వం ఉండాలని కోరారు. మహిళా వైద్యులకు, సిబ్బందికి ప్రత్యేక వాష్ రూమ్‌లు, ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు ఉండాలన్నారు. ఆసుపత్రులను క్రిటికల్ జోన్లుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. వైద్యవృత్తికి, సిబ్బందికి వ్యతిరేకంగా జరిగే హింసపై న్యాయ, పోలీసు విచారణ ప్రక్రియలను వేగవంతం చేసేలా నిబంధనలతో కూడిన కఠినమైన కేంద్రచట్టాన్ని రూపొందించి అమలు చేయాలని కోరారు. పీజీ విద్యార్థులకు బాండ్ పాలసీని తొలగించాలని డిమాండ్ చేశారు.

దళారుల మాట నమ్మవద్దు : ఎస్పీ

ఏలూరు క్రైం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఉద్యోగాల కోసం దళారుల మాటలు నమ్మి మోసపోవద్దని ఎస్పీ కేపీఎస్ కిశోర్ జిల్లా ప్రజలకు సూచించారు. ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో 45 ఫిర్యాదులను స్వీకరించారు. ఎస్పీ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగం రావాలంటే నోటిఫికేషన్ విడుదల చేస్తారని, పరీక్షలను నిర్వహించి ఆ పరీక్ష ల్లో ఉత్తీర్ణత సాధిస్తేనే ఉద్యోగ అవకాశాలు వస్తాయని డబ్బు ఇస్తే ఉద్యోగ అవకాశాలు లభించవన్నారు. ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పేవారి మాటలు నమ్మవద్ద సూచించారు. ఓటీపీ చెప్పాలని వచ్చే ఫోన్ల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. అదనపు ఎస్పీ ఎన్.సూర్య చంద్రరావు పాల్గొన్నారు.

రూ.4,500 కోట్లతో గ్రామాల అభివృద్ధి

- మంత్రి కొలుసు సారథి

నూజివీడు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా రూ.4,500 కోట్లతో పల్లెపండుగ కార్యక్రమం ద్వారా గ్రామాల్లో 30 వేల అభివృద్ధి పనులను చేపడుతున్నామని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. నూజివీడు మండలంలోని పోతురెడ్డిపల్లి సోమవారం రాత్రి పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా సీసీరోడ్ల పనులను ఆయన శంకుస్థాపన నిర్వహించారు.

అనంతరం జరిగిన సభలో మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. జిల్లాలో 547 పంచాయతీల్లో 1917 పనులను రూ.121.57 కోట్ల అంచనాలతో వివిధ అభివృద్ధి పనులను చేపట్టనున్నట్టు తెలిపారు. తొలుత గ్రామాల్లో సీసీరోడ్లు, డ్రెయిన్లు వంటి పనులను ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. ప్రజా అవసరాలకు తగిన విధంగా మిగిలిన పనులను కూడా గ్రామాల్లో పూర్తి చేసేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు.



వెంకటాయపాలెం గ్రామంలో సీసీ రోడ్లకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి సారథి

గ్రామాభివృద్ధి ద్వారానే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని గాంధీ మహాత్ముడు చెప్పిన మేరకు గ్రామాల అభివృద్ధికి పల్లెపండుగ అనే కార్యక్రమాన్ని రూపొందించామన్నారు. అంతకు ముందు మండలంలోని ఓగిరాలతండా, వెంకటాయపాలెం, మిట్టగూడెం, పటమటదిగవల్లి గ్రామాల్లో సీసీరోడ్ల పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. పంచాయతీరాజ్ ఈఈ బాపురెడ్డి, రెవెన్యూ, వివిధ శాఖల అధికారులు, స్థానిక తెలుగుదేశం నాయకులు పాల్గొన్నారు.

‘టెట్’కు 63 మంది గైర్హాజరు

ఏలూరు అర్బన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయ అర్హత పరీక్షల్లో (టెట్)లో భాగంగా సోమవారం ఉదయం జరిగిన పరీక్షకు 186 మంది అభ్యర్థులకు 160 మంది, మధ్యాహ్నం 186 మందికి 149 మంది హాజరయ్యారని డీఈవో అబ్రహం ఓ ప్రకటనలో తెలిపారు. మొత్తం 63 మంది గైర్హాజరయ్యారని తెలిపారు.

కైకరంలో ఫ్లైఓవర్ నిర్మాణానికి కొలతలు

ఉంగుటూరు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదారిపై కైకరం వద్ద ఫ్లైఓవర్ నిర్మాణం నిమిత్తం సోమవారం హైవే అధికారులు, రెవెన్యూ అధికా రులతో కలిసి కొలతలు వేశారు. హైవే డి.టి. సత్యనారాయణ, డి.ఐ. విశ్వనాథ్, మండల సర్వేయర్లు వి.ఆర్.వో నాగేశ్వరరావు పాల్గొన్నారు.

spicy · tasty

స్పైసీగా..

నయా ట్రెండ్



ఇక్కడే వెరైటీ నాన్‌వెజ్ రుచులు
పెరిగిన రెస్టారెంట్ కల్చర్
హైదరాబాద్ దమ్ బిర్యానీ ఇక్కడే..

హైదరాబాద్ బిర్యానీ..తందూరి చికెన్.. చికెన్ మంచురీయా.. పంజాబీ.. మొగలాయి బిర్యానీ.. ఇలాంటి నాన్ వెజ్ వంటకాల రుచి చూడాలంటే నగరాలకు వెళ్లినప్పుడే సాధ్యమయ్యేది.. కానీ కాలం మారిపోయింది...జనం కోరుకుంటున్న రుచికరమైన వంటకాలన్నీ ఇక్కడే దొరికేస్తున్నాయి.. అంతేకాదు ఎక్కడ ఏ వంటకం ఫేమస్ అయితే అక్కడకు వెళ్లి మరీ టేస్ట్ చేస్తున్నారు.. అందుకే మన ప్రాంతంలోనే ఎన్నో రెస్టారెంట్లు వెలుస్తున్నాయి.. మంచి చెఫ్‌లను తీసుకు వచ్చి నగరాల్లోనే కనిపించే వెరైటీ రకాలను ఇక్కడ రుచి చూపిస్తున్నారు.

- నరసాపురం/ఆంధ్రజ్యోతి

నాన్‌వెజ్ ప్రియుల నోరూరించే హైద్రాబాద్ బిర్యానీ ఇప్పుడు జిల్లాలోనే వండేస్తున్నారు. వీటితోపాటు డ్రాగన్ చికెట్, చిల్లీ చికెట్, దిల్‌కుష్ బిర్యానీ, చికెన్ 35, ఆర్మీ చికెన్, చికెన్ 666, ఫ్రైపీస్ బిర్యానీ, దమ్కు బిర్యానీ, మటన్‌కిమా బిర్యానీ, మటన్ దమ్ బిర్యానీ, కిచిడి బిర్యానీ వంటి స్పైసీ ఫుడ్స్‌ను ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని రెస్టారెంట్‌లు పోటీపడి తయారు చేస్తున్నాయి. కస్టమర్ల అభిరుచికి అనుగుణంగా రకరకాల నాన్‌వెజ్ వంటకాలు ప్రస్తుతం ఇక్కడే దొరికేస్తున్నాయి. దీనికి కావాల్సిన కుక్‌లను ఒడిశా, బిహార్, కోల్‌కతా, హైదరాబాద్‌ల నుంచి వేలకు వేలు జీతాలు ఇచ్చి రప్పిస్తున్నారు.



నాన్ వెజ్ కుక్స్‌కు డిమాండ్ : అర్జున్, కుక్, నేపాల్

నాన్ వెజ్ కుక్స్‌కు మంచి డిమాండ్ ఉంది. గతంలో నగరాల్లో మాత్రమే ఉపాధి ఉండేది. నేడు చిన్న చిన్న పట్టణాల్లోను రెస్టారెంట్‌లు పెట్టేస్తున్నారు. నగరాల్లో దొరికే వంటకాలను వండించి కస్టమర్లను ఆకర్షిస్తున్నారు. మాలాంటి వారికి మంచి ఉపాధి పెరిగింది. అడ్వాన్స్‌లు ఇచ్చి మరీ తీసుకొస్తున్నారు.



కొత్త రుచుల్ని ఇష్టపడుతున్నారు.

కస్టమర్లు స్పైసీ రుచులను ఇష్టపడుతున్నారు. బిర్యానీల్లో ఎన్ని వైరటీలు వచ్చినా.. ఇంకా కొత్తదాని కోసం చూస్తున్నారు. చికెన్, మటన్‌ల్లోను కొత్త వంటకాలు పేర్లు చెబితే.. రుచి చూసేందుకు ఆసక్తి చూపుతున్నారు. కొంత మంది కస్టమర్లు అడిగి వారికి కావాల్సిన రుచికి అనుగుణంగా మరి చేయించుకుంటున్నారు. దీనివల్ల కుక్స్‌ను కూడా ఇతర ప్రాంతాల నుంచి తీసుకురావాల్సి వస్తోంది.

- సన్నీ, రెస్టారెంట్ యజమాని, నరసాపురం



బిర్యానీలకే డిమాండ్

ఒకప్పుడు బిర్యానీల్లో పలావ్ మాత్రమే ఉండేది. ప్రస్తుతం దీన్ని ఎవరూ ఇష్టపడటం లేదు. ఇప్పుడంతా దమ్ బిర్యాని, లేదా కీమా బిర్యాని, మొగలాయ్, దిల్ కుష్, పంజాబీ బిర్యానీలకే డిమాండ్. అయినప్పటికీ కస్టమర్లు ఇంకా కొత్త రకం కోరుకుంటున్నారు.

- మాణిక్యం, రెస్టారెంట్ యజమాని



కోట్లలో వ్యాపారం

జిల్లాలో నాన్‌వెజ్ వ్యాపారం కోట్లల్లో సాగుతోంది. ఒకప్పుడు దూర ప్రాంతాలకు వెళితే హోటళ్ల, మెస్‌ల్లో భోజనం చేయడం అనవాయితీ. నేడు జిల్లాల్లో హోటళ్ల, మెస్‌ల సంఖ్య తగ్గిపోయింది. వీధి వీధికి ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, రెస్టారెంట్లు దర్శనమిస్తున్నాయి. కస్టమర్లు కూడా మంచి రెస్టారెంట్లను ఆరా తీసి మరీ వెళుతున్నారు. ఉమ్మడి పశ్చిమలో అత్యధికంగా రెస్టారెంట్లు ఏలూరు, భీమవరంలలో ఉన్నాయి. తర్వాత తాడేపల్లిగూడెం, తణుకు, పాలకొల్లు, నరసాపురం, జంగారెడ్డిగూడెంలలో ఉన్నాయి. ఇవి కాకుండా మండల కేంద్రాల్లోను రెస్టారెంట్లు వెలుస్తున్నాయి. జిల్లాలోని మొత్తం రెస్టారెంట్లలో వ్యాపారం రోజుకు రూ.2 కోట్ల నుంచి రూ.3 కోట్లపైనే ఉంటుంది. వీకెండ్స్, ఆదివారాలు, సెలవు రోజుల్లో రూ.4 కోట్లపైనే వ్యాపారం సాగుతుంది.

వెరైటీ పేర్లు

ఇప్పుడు రెస్టారెంట్ల పేర్లు వెరైటీగా ఉంటున్నాయి. గతంలో దేవుడు పేర్లతో పాటు సొంత పేర్లు కనిపించేవి. ఇప్పుడు హంగర్‌బౌల్, సెకండ్ వైఫ్, రాజు గారి రెస్టారెంట్, నాయుడు గారి కుండ బిర్యానీ, గోంగూర రెస్టారెంట్ వంటి పేర్లతో కస్టమర్లను ఆకర్షిస్తున్నారు. మన ప్రాంతంలో నాన్‌వెజ్ ప్రియులు కాజా బిర్యాని, సీతయ్య బిర్యాని, కుండ బిర్యానీలు ఎక్కువగా ఇష్టపడుతున్నారు. ఎంతో పేరు గాంచిన హోటళ్లలో ఈ రుచుల్ని ఆస్వాదించేందుకు ఇతర ప్రాంతాల నుంచి రావడం గమనార్హం.

ఇంటికే ..డెలివరీ

గతంలో ఏదైనా తినాలంటే రెస్టారెంట్‌కు వెళ్లాల్సి వచ్చేది. లేదా పార్శిల్ పట్టుకు వెళ్లేవారు. గడిచిన మూడేళ్లలో డోర్ డెలివరీ విధానం పెరిగింది. ఆన్‌లైన్‌లో నచ్చిన ఫుడ్ ఆర్డర్ చేస్తున్నారు. ఇంట్లో కుటుంబ సభ్యులు అంతా కలిసి రుచి చూస్తున్నారు. వ్యాపారం కూడా భారీగా పెరిగింది. దీనికి టైం అంటూ లేదు. ఉదయం నుంచి రాత్రి 11 గంటల వరకు ఏ సమయంలోనైనా బుక్ చేసుకునే వెసులుబాటు ఉండటంతో మారుమూల గ్రామాలకు నాన్‌వెజ్ పార్శిల్స్ వెళుతున్నాయి. జొమోటా, స్విగ్గీ వంటి డోర్ డెలివరీ సంస్థలు దర్శనమిస్తున్నాయి.


చారిత్రక వైభవం



వెయ్యేళ్ల గాలి గోపురం

అలనాటి ప్రాచీన సంస్కృతీ, సంప్రదాయాలకు నిలయాలు మన ఆలయాలు. ఆలయాల్లోని ప్రతీ గాలి గోపురానికి ఓ ప్రాముఖ్యత ఉంటుంది. అపురూపమైన చిత్రకళకు, శిల్ప కళా సంపదకు అవి ఆనవాళ్లు. ఏలూరులోని శనివారపుపేట చెన్నకేశవస్వామి ఆలయంలోని గాలి గోపురం వెయ్యేళ్ల చరిత్ర కలిగినది. ఇది చాళుక్యుల కాలం నాటి వైభవానికి ప్రతీకగా నిలుస్తోంది. వంద అడుగుల ఎత్తులో నాలుగు అంతస్తులుగా ఉంటూ విశేష శిల్ప కళా సంపదతో చూపరులకు కనువిందు చేస్తోంది. 11వ శతాబ్దంలో దీని నిర్మాణం జరిగింది. చాళుక్యుల కాలంలో జరిగినట్లు పురావస్తు శాఖ నిర్ధారించింది. గోపురంపై ఆనాటి చాళుక్య రాజుల సంస్కృతీ, సంప్రదాయాలతోపాటు రామాయణం, శ్రీరామపట్టాభిషేకం, మహాభారతం, భాగవతం వంటి పురాణ ఇతిహాసాలు, క్షీరసాగర మథనం, యక్షులు, గంధర్వులు, కిన్నెరలు, కింపురుషులు, ఆళ్వార్లు, రుషులు, మునులు, వాత్సాయన కామసూత్రకు సంబంధించిన శిల్పాలను శాస్త్రీయ విధానంలో ప్రాచీన వైభవానికి సంకేతంగా నిర్మించారు. పూర్తిగా ఇసుక, రాతి శిలతో నిర్మితమైన ఈ గాలి గోపురం కొన్నేళ్ళ క్రితం శిథిలావస్థకు చేరుకుంది. 2004లో గోపురం మీద ఉన్న శిలా సంపదను తొలగించి పునర్ నిర్మించారు. చాణుక్యుల రాజుల కాలంలో గోపురం నిర్మితమైనప్పటికి తరువాత కాలంలో అప్పటి జమీందార్లు మేకా ధర్మఅప్పారావు ఆలయానికి పోషకులుగా ఉన్నట్లు ఇక్కడ శాసనాల ద్వారా తెలుస్తోంది. ద్వారకాతిరుమల దత్తత ఆలయంగా ఉన్న ఈ ఆలయం ప్రస్తుతం దేవదాయ శాఖ పరిధిలో ఉంది. ఈ ఆలయంలో విష్ణుమూర్తి, చెన్నకేశవుడిగా, వేంకటేశ్వరుడిగా రెండు రూపాల్లో కొలువై ఉన్నాడు.

- ఏలూరు రూరల్ /ఆంధ్రజ్యోతి



గాలి గోపురంపై శిల్పకళా సౌందర్యం

మేడపైనే కూరల సాగు

ఇప్పుడు ఏం తిందామన్నా కల్తీ అయిపోయింది. కూరగాయలు, పండ్లు, ఆకుకూరలు ఇలా అన్నీ రసాయన మందులతో కలుషితమై పోతున్నాయి. వాటిని తినడం వల్ల ఆరోగ్యమూ పాడవుతోంది. వీటికి చెక్ పెట్టేందుకు ప్రకృతి సిద్ధంగా ఎటువంటి రసాయనిక ఎరువులు, పురుగు మందులు వాడకుండా తమ ఇంటిపైన మిద్దె తోట సాగు చేపట్టారు చాట్రాయికి చెందిన గోళ్ళ విశ్వేశ్వరరావు, శేషకుమారి దంపతులు. గతంలో మార్కెట్ నుంచి కూరగాయలు ఆకుకూరలు కొనుగోలు చేసి ఉపయోగించేవారు. అవి తినడం వలన అనేక ఆరోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతూ ఆసుపత్రులకు ఎంతో డబ్బు ఖర్చు పెట్టేవారు. దీంతో వీరికి మిద్దెతోట ఆలోచన వచ్చింది. స్థానిక చెరువు నుంచి సారవంతమైన మట్టి తెచ్చి ఇంట్లో ఉన్న పనికిరాని డబ్బాలు, డ్రమ్ముల్లో మట్టిని నింపి వివిధ రకాల కూరగాయలు, ఆకు కూరలు, పూలు విత్తనాలు నాటారు. ఎటువంటి రసానిక ఎరువులు వేయకుండా కేవలం పశువుల పేడ మాత్రమే ఉపయోగిస్తూ సాగు చేపట్టారు. వంగ, బెండ, దొండ, టమాటా మొదలైన కూరగాయలు, పాలకూర, తోటకూర, బచ్చలి, కొత్తి మీర, పుదీనా మొదలైన ఆకుకూరలు పండిస్తున్నారు. తమ కుటుంబ అవసరాలకు పోను మిగిలినవి స్నేహితులకు ఉచితంగా ఇస్తున్నారు.

- చాట్రాయి/ఆంధ్రజ్యోతి

ఆరోగ్యంగా జీవిస్తున్నాం





ఇప్పుడంతా రసాయనిక ఎరువులు, పురుగు మందులు వాడి పండించిన కూరగాయలనే తినాల్సి వస్తోంది. దీనివల్ల చాలా అనారోగ్య సమస్యలు వస్తాయి. మేము కూడా చాలా ఇబ్బందులు పడ్డాం. ఆసుపత్రుల చుట్టూ తిరిగి శారీరకంగా, ఆర్థికంగా నష్టపోయాం. కుటుంబ ఆరోగ్యం కోసం ఈ మిద్దె తోట సాగు చేపట్టాం. రోజు రెండ గంటలపాటు మిద్దె తోటలో పని చేయడం వల్ల ఆరోగ్యం మెరుగైంది. కల్తీ లేని కూరలు తింటున్నాం. కుటుంబ సభ్యులందరికి ఆరోగ్య సమస్యలు తగ్గిపోయాయి. ఆసుపత్రులకు వెళ్ళే అవసరం కూడా తగ్గింది.

- గోళ్ళ విశ్వేశ్వరరావు, శేషకుమారి దంపతులు, చాట్రాయి.

మిద్దె తోట



మేడపైన ఎన్ని మొక్కలో..

చేతివాటం సరిగా లేకుంటే..

రోగాలు ఖాయం







మధ్యాహ్న భోజన సమయంలో పిల్లలు చేతులను కడుక్కోకపోవడం వల్లే వారు తరచూ అతిసార వ్యాధికి గురవుతున్నారని 1940లో వియత్నాంలోని వియన్నా జనరల్ హాస్పటల్ వైద్యాధికారి ఇగ్నేజ్ సెమ్మెల్‌వీస్ తన పరిశోధనల్లో గుర్తించారు. అందుకే ఆయనను పరిశుభ్రత పితామహుడుగా పిలుస్తారు. అలాగే అతిసార, శ్వాసకోస వ్యాధులకు గురై ఏటా వేలాది మంది చిన్నారులు చనిపోవడానికి చేతులు పరిశుభ్రంగా ఉంచుకోకపోడమే కారణమని ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్ధారించింది. దీనిపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఐక్యరాజ్యసమితి 2008 అక్టోబరు 15న ప్రపంచ చేతుల పరిశుభ్రత దినోత్సవంగా జరుపుకోవాలని నిర్ణయించింది.

నిడమర్రు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి):చిన్నారులకు తమ పాఠశాల వయసు నుంచే చేతుల పరిశుభ్రతపై అవగాహన పెంచడం కోసం ఐక్యరాజ్యసమితి అక్టోబరు 15న ప్రపంచవ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో చేతుల పరిశుభ్రతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోంది. తల్లిదండ్రులు తమ చిన్నారులకు చేతులు పరిశుభ్రంగా కడుక్కోవడాన్ని అలవాటు చేయాలి. పాఠశాలల్లో ఉపాధ్యాయులు మధ్యాహ్న భోజన సమయంలో ప్రతి పిల్లవాడితోను చేతులు కడుక్కున్న తర్వాత ఆహారం తీసుకొనేలా అవగాహన కల్పించాలి.

చేతుల శుభ్రత ఇలా..

- రోగాల నివారణకు.. చేతుల పరిశుభ్రంగా ఉంచుకోవాలని వైద్య నిపుణులు సూచనలు చేశారు. ప్రతి ఒక్కరు చేతులను సబ్బుతో శుభ్రం చేసుకోవాలి.
- ముందుగా చేతులను నీళ్లతో తడిచేసుకుని, సోప్‌తో గానీ, హ్యాండ్ వాషింగ్ లిక్విడ్‌తో కాని నురుగ వచ్చే వరకు రుద్దాలి.
- సబ్బు నరుగతో అరచేయిలో మరో అరచేయి వేసి రుద్దాలి.
- చేతి వేళ్ల సందుల్లో వేళ్లు వేసి రుద్దుకోవాలి.
- చేతుల గోళ్ల వద్ద ప్రత్యేకంగా సబ్బుతో రుద్దుకోవాలి.
- చేతుల ఉపరితలం మీద సబ్బుతో మణికట్టు వరకు రద్దుకోవాలి.
- నడుస్తున్న నీటితో చేతులు శుభ్రం చేసుకోవాలి.
- పొడి గుడ్డతో లేదా సింగిల్ యూజ్ పేపర్ (టిష్యూ పేపర్) తో తుడుచుకోవాలి.
- ఈ ప్రక్రియ సుమారు 20-30 సెకన్లపాటు నిర్వహిస్తే మన చేతిలో క్రిముల 95% వరకు నిర్మూలించవచ్చని వైద్యులు చెబుతున్నారు.

ఆరోగ్యానికి రక్ష

మన తీసుకొనే ఆహారం ద్వారానే మనకు రోగాలు వస్తాయని వైద్యులు చెబుతున్నారు. తీసుకొనే ఆహారం పరిశుభ్రమైనప్పుడు రోగాల నుండి దాదాపు దూరంగా ఉండవచ్చు. 90 శాతం రోగాలు ఆహారం తీసుకునే ముందు చేతులు కడుక్కోకపోవడం ద్వారా వ్యాపిస్తాయి. బ్యాక్టీరియా, వైరస్‌లు చేతుల ద్వారా మన ఆహారంతోపాటు జీర్ణాశయంలో ప్రవేశించి అనేక రోగాలకు కారణమవుతున్నాయి. చేతులు పరిశుభ్రత ద్వారా పిల్లల్లో 20 శాతం నుంచి 40 శాతం డయేరియా రోగాలు తగ్గుముఖం పట్టాయి. 58 శాతం మందిలో డయేరియా వ్యాధికారక క్రిములు నిర్మించబడ్డాయి. 20 శాతం మందిలో శ్వాసకోస రోగాలు వ్యాప్తి నివారించబడిందని పరిశోధనలు నిర్ధారించాయి.

చేతులను శుభ్రంగా ఉంచుకోవాలి

డాక్టర్ కిరణ్ కొత్తకొండ, ఫార్మాస్యూటికల్ సైంటిస్ట్

చేతుల ద్వారానే 90 శాతం క్రిములు శరీరంలోకి ప్రవేశిస్తాయని పరిశోధనల్లో నిరూపితమైంది. అతి తక్కువ ఖర్చుతో సమర్థవంతంగా చేతులను పరిశుభ్రంగా ఉంచుకోవచ్చు. దీనిపై పాఠశాల స్థాయి నుండే విద్యార్థులకు అవగాహన కల్పించడం ద్వారా పిల్లలను ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దవచ్చు.

చేతులు ఎప్పుడు కడుక్కోవాలి

- మల విసర్జన, మూత్ర విసర్జనల తర్వాత
- భోజనాలు తయారుచేసే ముందు.. తినే ముందు..
- దగ్గు వచ్చిన తర్వాత.. ముక్కు చీదిన తరువాత
- చేతులు మురికిగా ఉన్నప్పుడు..
- జంతువులను తాకిన తర్వాత
- పేడ వంటి జంతువుల మల మూత్రాలను తాకిన తర్వాత తప్పనిసరిగా చేతులు పరిశుభ్రం చేసుకోవాలని సూచించింది.

ఆరోగ్యానికి అదే రక్ష

ఎస్.అబ్రహం, డీఈవో, ఏలూరు

ప్రపంచ చేతుల పరిశుభ్రత దినోత్సవంపై జిల్లాలోని అన్ని పాఠశాలల్లో మంగళవారం ఆరోగ్య సిబ్బందితో కలిసి విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు జరుగుతాయి. ప్రత్యేకంగా చేతులను ఎలా శుభ్రంగా కడుక్కోవాలో వివరిస్తాం. పరిశుభ్రమైన చేతులే ఆరోగ్యానికి రక్ష అని వారికి అర్థమయ్యే విధంగా తెలియచెబుతాం.



శ్రీవారి క్షేత్రానికి బ్రహ్మోత్సవ శోభ

ద్వారకాతిరుమల, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): బ్రహ్మోత్సవ శోభతో చిన్న తిరుమలేశుని క్షేత్రం మిరు మిట్లు గొలుపుతోంది. ఆశ్వయుజ మాస దివ్య బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని క్షేత్ర పరిసరాలు సర్వాంగ సుందరంగా ముస్తాబై చూపరులకు కనువిందు చేస్తోంది. ఈ క్రమంలో ఆలయాన్ని, పరిసరా లను విద్యుద్దీప తోరణాలతో శోభాయమానంగా అలంకరించారు. ఆలయ గోపురాలు విద్యుత్ దీప కాంతులతో కళకళలాడుతున్నాయి. అనివేటి మండప ప్రాంతం విద్యుత్ కాంతులతో మెరిసి పోతోంది. ఆలయ పాతకల్యాణమండపం ముందున్న విలాస మండపం వద్ద శ్రీవారు, అమ్మవార్ల దాదాపు 20 అడుగుల భారీ విద్యుత్ కటౌట్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. ఆలయ విద్యుత్ డీఈ సూర్యనారాయణ పర్యవేక్షణలో ఈ విద్యుత్ తోరణాలు ఏర్పాటయ్యాయి.



నేత్రపర్వం..ధ్వజారోహణం.

బ్రహ్మాండనాయకుని బ్రహ్మోత్సవాలకు సకల చరాచర సృష్టికి ఆహ్వానం పలుకుతూ సోమవారం రాత్రి జరిగిన ధ్వజారోహణ వేడుక భక్తజనకోటికి కన్నుల పండువైంది. వైఖానస ఆగమ యుక్తంగా ఇంద్రాది అష్టదిక్పాలకులు, సర్వ దేవతలను, దేవగణాలను, స్వాగతిస్తూ వేద మంత్రోచ్ఛరణలతో అర్చకులు శ్రీవారి ఆలయ ప్రాకారంలోని ధ్వజస్తంభంపై గరుడపటం ఎగురవేశారు. సాయంత్రం ఆలయంలో అంకురార్పణ శాస్త్రోక్తంగా జరిపారు. బ్రహ్మోత్సవాల్లో మంగళవారం ఉదయం 7 గంటలకు సూర్యప్రభ వాహనంపై తిరువీధిసేవ, ఉదయం 8-30 నుంచి భజన సంకీర్తనలు, రాత్రి 7 గంటల నుంచి చంద్రప్రభ వాహనంపై గ్రామోత్సవం జరుగుతాయి.



ధ్వజపటం ఎగురవేస్తున్న అర్చకులు

అమ్మవారి లడ్డు రూ. 1,11,000

ఆకివీడురూరల్ అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : ఆకివీడు మండలం చినకాపవరం పంచాయతీ పరిధిలోని జానకిరామరాజపురంలో అమ్మవారి 90 కిలోల లడ్డు వేలంలో రూ.1,11,000 సరిపల్లె నరేష్‌రాజు దక్కించుకున్నారు. అమ్మవారి లడ్డు దక్కించుకునేందుకు ప్రతిఏటా పెద్దఎత్తున వేలంలో పాల్గొంటారు. అమ్మవారి ఉత్సవాలు ప్రారంభించిన నాటి నుంచి గ్రామానికి చెందిన భూపతిరాజు రంగరాజు లడ్డు దక్కించుకునే వారు. ఆయన అల్లుడైన సరిపల్లె నరేష్ ఈసారి దక్కించుకోవడం విశేషం.



నాన్‌వెజ్ వంటకాలతో అన్న సంతర్పణ

ఆకివీడురూరల్ అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): సాధారణంగా పండుగలకు నిర్వహించే సంతర్పణలు పూర్తిగా శాఖాహారంగా ఉంటాయని తెలుసు. కానీ ఆ గ్రామంలో మాత్రం నాన్‌వెజ్ వంటకాలతో నిర్వహిస్తారు. ఆకివీడు మండలం సిద్దాపురంలోని బీటులోని రామాలయం వద్ద ఏటా దసరా నవ రాత్రులు ఘనంగా నిర్వహిస్తారు. అమ్మవారి నిమజ్జనం అయిన తరువాత నిర్వహించే అన్న సంత ర్పణలో రెండు రకాలు మాంసాహారంతో పాటు, కోడిగుడ్డు, బిర్యాని, బూరి, గుమ్మడికాయ దప్పళం, రసంతో పాటు ఒక శాఖాహార కూర వడ్డిస్తారు. దీంతో భోజన ప్రియులు ఈ సంతర్పణకు క్యూ కడతారు. నవరాత్రులు పూర్తిగా ఉపవాసాలు ఉంటామని దసరా పూర్తయిన సందర్భంగా ఇలా నాన్ వెజ్



వంటకాలతో చప్పబడిన నాలుకకు రుచి చూపిస్తామని అక్కడివారు చెప్పారు..

అన్నింటా ఆమె

సాధికార దిశగా అడుగులు

నేడు అంతర్జాతీయ గ్రామీణ మహిళా దినోత్సవం

యత్ర నార్యస్తు పూజ్యంతే రమంతే తత్ర దేవతా:... ఎక్కడ స్త్రీలు పూజింప బడతారో అక్కడ దేవతలు వెలుస్తారని దీని భావన.. వాస్తవంలో నిజమే అని నిరూపిస్తున్నారు నేటి మహిళలు. ఏ రంగంలోనూ పురుషులకూ తామేమీ తక్కువ కాదన్నట్లు దూసుకు పోతున్నారు. అన్ని చోట్లా గౌరవ ప్రదమైన స్థానాన్ని సంపాదించుకుంటు న్నారు. అందరికీ మంచి ఆహారం పండిస్తున్న రైతు మిత్రులకు సహాయ సహకారా లందించే విషయంలో, ఆహార ఉత్పత్తులు పండించే విషయంలో, వివిధ రంగాల్లో గ్రామీణ మహిళలు ముఖ్యమైన పాత్ర పోషిస్తున్నారు. నేడు అంతర్జాతీయ గ్రామీణ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం

- పోలవరం , గణపవరం

ఉత్పత్తి నుంచి ఆహార పదార్థాలను తయారు చేయడం, ప్రోసెస్ చేయడం పంపిణీ, రవాణా చేయడంలో మహిళల శ్రమ వర్ణించలేనిది.

గ్రామీణ ప్రాంతాల్లో పండించే వరి, మొక్కజొన్న ఇతర ఆహార ధాన్యాల సాగులో మహిళలదే ప్రధాన పాత్ర. వరినాట్లు వేయడం నుంచి కలుపు తీసి వరి కోత కోసే వరకూ, మొక్కజొన్న విత్తనం వేసిన నాటి నుంచి కలుపు తీసి పొత్తు విరిచి గింజ రాల్చే వరకూ, మినుము, పెసర , కంది అపరాలు, కూరగాయల పంటల సాగులో మహిళలదే ప్రధాన పాత్ర. కోళ్ళ ఫారాలలో గుడ్లు సేకరించి ట్రేలలో పేర్చడం, కోళ్ళకు దాణా వేయడం, బేకరీల్లో, హోటళ్ళలో ఆహార పదార్థాల తయారీలో, పచ్చళ్ళ పరిశ్రమల్లో, తినుబండారాల తయారీ, ప్యాకింగ్ పరిశ్రమల్లో మహిళలు లేకుండా పని ముందుకు సాగదు. డ్వాక్రా స్వయం సహాయక సంఘాల ద్వారా ఆర్థికంగా బలపడి వ్యాపారాలు , పాడి పశువుల పెంపకం, పెరటి కోళ్ళ పెంపకం, కుట్టు మిషన్లు, కిరాణా దుకాణాల నిర్వహణ ద్వారా ఆర్థికంగా కుటుంబానికి సహాయపడుతున్నారు.

కొవిడ్ 19 మహమ్మారి సంక్షోభ సమయంలో 2020 సంవత్సరంలో సుమారు 2.37 బిలియన్ల మంది ప్రజలకు ప్రస్తుతం పండించే ఆహారం చాలక ఆకలికి అలమటించారు. ఆ పరిసితుల్ని దాటి ఆహార ఉత్పత్తులు పెంచేందుకు,గ్రామీణ మహిళలకు జీవనోపాధి ద్వారా మద్దతు ఇవ్వడం కోసం వారిలో నైపుణ్యాలు, నాయకత్వ లక్షణాలు అలవరచడానికి యునైటెడ్ నేషన్స్ కృషి చేస్తున్నది. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి పొందుతూ, సాటి మహిళలకు ఉపాధి కల్పిస్తూ ముందుకు దూసుకుపోతున్న మహిళల గురించి వారి మాటల్లోనే మనం తెలుసుకుందాం



- పదో తరగతి చదివాను. వివాహమై ఏడు సంవత్సరాలైంది. డ్వాక్రా స్వయం సహాయక సంఘం ద్వారా రుణం పొంది కిరాణా కొట్టు నిర్వహించాను. మొదట్లో నాకు మాత్రమే ఉపాధి లభించింది.ఆర్థికంగా కొంతవరకు సమస్య తీరింది. నాకు నైపుణ్యం ఉన్న జీడిపప్పు ప్రోసె సింగ్ యూనిట్ ప్రారంభించాను. జీడి గింజల నుంచి పప్పు వేరు చేసే మిషన్ల ద్వారా నాతో పాటు మా వీధిలో మరో పదిమంది మహి ళలకు ప్రోసెసింగ్ శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పిం చాను. ప్రభుత్వం సహకరించి పెద్ద యూనిట్ స్థాపనకు రుణం మంజూరు చేస్తే మరింతమంది మహిళలకు ఉపాధి కల్పించగలను.

-జయవరపు శివజ్యోతి, పోలవరం

- నేను డ్వాక్రా ద్వారా రుణం పొంది కర్రీ పాయింట్ ప్రారం భించాను. నాలు గేళ్ళుగా కర్రీ పాయింట్ నిర్వహిస్తున్నాను. ఇద్దరు ఆడపిల్లల్ని చదివిస్తున్నాను. నాతో పాటు మరో నలుగురు మహిళలు ఉంటున్నారు.

-చిలకా శ్రీదేవి,పోలవరం



- 12 సంవత్సరాలుగా జ్యూస్ సెంటర్ నడుపు తున్నాం. మేము ముగ్గురు అక్క చెల్లెలం. జ్యూస్ సెంటర్ నిర్వహిస్తూ ఉపాధి పొందుతున్నాం. కుటుంబానికి మేమే ఆధారంగా ఉన్నాం. జ్యూస్ సెంటర్ సీజనల్ వ్యాపారమైనప్పటికీ ఏడాది పొడవునా కొనసాగిస్తున్నాం. అలవాటు ఉన్న విని యోగదారులు క్యాలిటీ రీత్యా నిత్యం కొనుగోలు చేస్తుంటారు.

వెలగంటి ఊహ, పోలవరం



ఆర్థికంగా నిలదొక్కుకోవాలి



మహిళలకు ఆర్థికంగా నిలదొక్కు కుంటే ఆ కుటుంబం సుఖసంతోషాలతో ఉంటుంది. పురుషులే కుటుంబాన్ని పోషించాలంటే నేడు కష్టం. సీజనల్‌గా లభించే పండ్లను గణపవరం రహదారి పక్కన విక్రయి స్తుంటాను. ప్రస్తుతం నిమ్మ కాయలు మెట్ట ప్రాంతం నుంచి కొనుగోలు చేసి ఇక్కడ విక్రయిస్తున్నాం. రోజూ ఖర్చులు పోను రూ.500 వరకు వస్తుంది. వచ్చిన సొమ్ముతో కుటుంబాన్ని పోషించుకుంటున్నాం.

- తాడిగడప కుమారి,
చిరువ్యాపారి, గణపవరం

కుటుంబానికి ఆసరాగా..



కాకినాడ, నర్సాపురం ప్రాంతాల నుంచి పీతలను కొనుగోలు చేసుకుని గణపవరంలో విక్ర యిస్తుంటాను. రోజూ రూ.600 నుంచి రూ.800 వస్తుంది. ఎవరి దగ్గరకు పనికోసం వెళ్లనవసరం లేకుండా సొంతంగా సంపాదించు కుని కుటుంబానికి తోడుగా ఉంటున్నాను.

- జెక్కా శేషాయమ్మ, గణపవరం





నోట్ల కట్టల కట్టలు..

భీమవరం, ఏలూరుల్లో సోమవారం మద్యం దుకాణాలకు సంబంధించి డ్రా తీశారు.. జాక్‌పాట్ కొట్టిన వారు లైసెన్స్ ఫీజు కట్టేందుకు తెచ్చిన సొమ్ములు అధికారులు మెషిన్లపై ఇలా లెక్కపెట్టి కట్టలు కట్టారు...





గ్రామీణ ఆరోగ్యానికి 'ప్రక్షాళన' ఆవశ్యం

పలు ఆరోగ్య ఉపకేంద్రాల్లో అవసరానికి మించి ఏఎన్‌ఎంలు

ఏలూరు అర్బన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : పలు ప్రభుత్వ శాఖలు సంతృప్తికర స్థాయిలో ఉద్యోగులు లేక పనిభారాన్ని, తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటుండగా వైద్య ఆరోగ్యశాఖలో కొన్ని విభాగాలు ఇబ్బడి ముబ్బడిగా సిబ్బందితో 'పని విభజన - సిబ్బంది హేతుబద్ధీకరణ' సమస్యను ఎదుర్కొంటున్నట్టు ప్రచారం జరుగుతోంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని ఆరోగ్య ఉప కేంద్రాలు, సచివాలయాలు, హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్లలో ఏఎన్‌ఎంల విషయంలో ఈ సమస్య స్పష్టంగా కనిపిస్తోందని చెబుతున్నారు. ఇటీవలే సచివాలయాల్లో డిప్యూటేషన్లపై ఏఎన్‌ఎం విధులు నిర్వర్తిస్తున్న ఆరోగ్య ఉప కేంద్రాల ఏఎన్‌ఎం (ఎంపీహెచ్‌ఏ)లు తమను మాతృ శాఖ (వైద్యఆరోగ్యశాఖ)కు పంపాలనే డిమాండ్ పరిష్కారం కాకుండానే, ఇంటెన్సిఫైడ్ జీఎన్‌ఎం శిక్షణను పూర్తిచేసుకున్న సచివాలయ ఏఎన్‌ఎంలు వారి స్థానాల్లో విధుల్లోకి చేరి పోయిన విషయం విదితమే. మరోవైపు ఒక్కో గ్రామం పరిధిలో జనాభా సంఖ్యను బట్టి 3 నుంచి 4 వరకు సచివాలయాలను ఏర్పాటు చేసిన గత వైసీపీ ప్రభుత్వం ఎడాపెడా గ్రేడ్-3 ఏఎన్‌ఎంలను నియమించిందనే ఆరోపణలు ఉన్నాయి. తాజాగా గ్రేడ్-3 ఏఎన్‌ఎంలకు ఎంపీ హెచ్‌ఏ పదోన్నతులు ఇచ్చేందుకు తాత్కాలిక సీనియార్టీ జాబితాలను సిద్ధం చేయాల్సిందిగా మౌఖిక ఆదేశాలు జారీ కావడంతో క్షేత్రస్థాయిలో ఏఎన్‌ఎంల హేతుబద్ధీకరణ (రేషనలైజేషన్) ఆవశ్యకతను గుర్తు చేస్తోంది. ఇప్పటికే సచివాలయాల్లో విధులు నిర్వర్తిస్తున్న గ్రేడ్-3 ఏఎన్‌ఎంలు సంబంధిత ఆరోగ్య ఉపకేంద్రాల్లో విధులు నిర్వర్తించేలా కొద్దిరోజుల క్రితం ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. అవే సచివాలయాల్లో ఇంత వరకు డిప్యుటేషన్లపై విధులు నిర్వర్తిస్తున్న ఆరోగ్య ఉపకేంద్రాల ఎంపీహెచ్‌ఏలను వెనక్కి పంపేందుకు ఇప్పటికీ ఉత్తర్వులు వెలువడ లేదు. ఒకవేళ ఉత్తర్వులు విడుదలైనా పలు ఆరోగ్య ఉపకేంద్రాల్లో రెగ్యులర్ ఏఎన్‌ఎం, సెకండ్ ఏఎన్‌ఎంతో పాటు కొత్తగా గ్రేడ్-3 ఏఎన్‌ఎం విధులు నిర్వర్తించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. కొన్ని ఆరోగ్య ఉపకేంద్రాల్లో గరిష్ఠంగా ఐదుగురు ఏఎన్‌ఎంలు ఉన్నట్టు సమాచారం. జిల్లాలో 634 ఆరోగ్య ఉపకేంద్రాలు, సుమారు 1400 సచివాలయాలు న్నాయి. కొత్తగా ఎంపీహెచ్‌ఏ పదోన్నతులు ఇవ్వనున్న నేపథ్యంలో క్షేత్రస్థాయిలో ఆరోగ్య ఉపకేంద్రాలు, సచివాలయాలకు కేటాయించిన ఏఎన్‌ఎంలు, ఎంపీహెచ్‌ఏలు, సెకండ్ ఏఎన్‌ఎంల సంఖ్య, ఆవశ్యకతలపై హేతుబద్ధీకరణను వాస్తవ పరిస్థితులకనుగుణంగా జరిపిన తర్వాతే చేపట్టడం వల్ల ప్రయోజనం ఉంటుందని తెలుస్తోంది. ప్రతీ ఆరోగ్య ఉప కేంద్రానికి కేటాయించిన మిడ్‌లెవెల్ హెల్త్ ప్రొవైడర్ (ఎంఎల్‌హెచ్‌పీ)ల విషయంలోనూ ప్రక్షాళన /హేతుబద్ధీకరణ అవసరమని చెబుతున్నారు.



కృత్రిమ అవయవాలు అందజేస్తున్న వైద్యులు కృష్ణకిరణ్ తదితరులు

విర్డ్ ఆసుపత్రిలో ప్రత్యేక క్యాంపు

ద్వారకాతిరుమల, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ద్వారకా తిరుమల విర్డ్ ఆసుపత్రిలో ప్రముఖ జాయింట్ రీప్లేస్మెంట్ సర్జన్లు డాక్టర్ కృష్ణకిరణ్, డాక్టర్ నీల్‌శీత్‌ల ఆధ్వర్యంలో సోమవారం ప్రత్యేక క్యాంపు నిర్వహించారు. 20 మందిని పరీక్షించి అందులో 8 మందికి తుంటి, మోకాలు శస్త్ర చికిత్సలను విజయ వంతంగా జరిపినట్లు విర్డ్ ఆసపత్రి చైర్మన్ రాజా ఎస్‌వీ సుధాకరరావు తెలిపారు. గుప్తా ఫౌండేషన్ చైర్మన్ ఎంఎం గుప్తా సహకారంతో ప్రోస్తాసిస్ 3డి ప్రింట్‌తో తయారైన కృత్రిమ అవయవాలను 16 మంది దివ్యాంగులకు పంపిణీ చేశారు. వైద్యులు భవ్యచంద్, హమీద్, బాలాజీ విహారి, పీవీ నాగేంద్రబాబు, సింధు, గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

కారులో నిద్రపోతున్న మహిళ మెడలో బంగారు గొలుసు చోరీ

ఏలూరు క్రైం, అక్టోబరు 14 : కారులో నిద్రపోతున్న ఒక మహిళ మెడలోని బంగారు ఆభరణాలు అపహరణకు గురయ్యాయని ఏలూరు రూరల్ పోలీసులకు ఫిర్యాదు అందడంతో కేసు నమోదు చేశారు. శ్రీకాకుళం జిల్లా పురుషోత్తపురానికి చెందిన తవిటి నాయుడు కుటుంబ సభ్యులు విజయవాడ కనకదుర్గ దర్శనం చేసుకుని ఆదివారం అర్ధరాత్రి బయలుదేరారు. ఏలూరు మెయిన్ బైపాస్ రత్నాస్ హోటల్ వద్దకు వచ్చేసరికి డ్రైవర్‌కు నిద్రరావడంతో రత్నాస్ హోటల్ పక్కన సర్వీసు రోడ్డులో కారు ఆపి అందరూ పడుకున్నారు. డ్రైవర్ దగ్గర ఉన్న అద్దాన్ని దించి ఉంచారు. గుర్తు తెలియని దొంగలు అక్కడకు వచ్చి దించి ఉంచిన అద్దం నుంచి మిగిలిన డోర్స్ లాక్ తీసి వెనుక సీటులో పడుకున్న మహిళ మెడలోని రెండున్నర కాసుల బంగారపు గొలుసును కట్ చేసుకుని వెళ్ళిపోయారు. సంఘటనపై ఏలూరు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. రూరల్ ఎస్ఐ దుర్గా ప్రసాద్ సోమవారం కేసు నమోదు చేశారు.

వ్యాన్ ఢీకొని యువకుడి మృతి

వేలేరుపాడు, అక్టోబరు 14: వ్యాన్ ఢీకొని వేలేరుపాడు మండలం రుద్రమ్మకోట గ్రామా నికి చెందిన గాదే అనీల్‌కుమార్ అనే యువకుడు మృతి చెందాడు. అనీల్‌కుమార్ (35) రుద్రమ్మ కోట నుంచి భద్రాచలం వైపు ద్విచక్రవాహనంపై వెళ్తుండగా అల్లూరి సీతారామరాజు మన్యం జిల్లా ఎటపాక మండలం గన్నవరం గ్రామం వద్ద వెనుక నుంచి గ్యాస్ సిలిండర్లతో వెళ్తున్న వ్యాన్ ఢీకొనడంతో అనీల్‌కుమార్ తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మరణించాడు. ఎటపాక పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. అనిల్ కుమార్‌కు భార్య, ఇద్దరు చిన్నారులు ఉన్నారు.

మందలించారని మనస్థాపంతో ఆత్మహత్య

భీమడోలు, అక్టోబరు 14 : మద్యానికి బానిసై కుటుంబ సభ్యులతో గొడవపడి గడ్డిమందు తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. భీమడోలు మండలం గుండుగొలను గ్రామానికి చెందిన బోడా కుమార్‌రాజా (45) కూలి పనులు చేస్తూ జీవిస్తుంటాడు. తనకు వివాహం కాగా. కుమారులు ఇద్దరు ఉన్నారు. అయితే రోజూ మద్యం సేవించి కుటుంబ సభ్యులతో గొడవపడు తుంటాడు. ఈ నేపథ్యంలో 13వ తేదీ మద్యం సేవించి ఇంట్లో కుటుంబ సభ్యులతో గొడవ పడ్డాడు. కుటుంబ సభ్యులు అతనిని మందలించడంతో మనస్థాపానికి గురై స్థానిక అంబేద్కర్ విగ్రహం సమీపంలో గడ్డిమందు తాగి అపస్మారక స్థితికి వెళ్ళాడు. అతని సోదరుడు రాజేంద్ర కుమార్ ఇంట్లో వారికి ఫోన్‌చేసి ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా సోమవారం ఉదయం 5 గంటల సమయంలో మృతి చెందాడు. మృతుడి కుమారుడు అర్జున్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు భీమడోలు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బైక్ కొనలేదని యువకుడి బలవన్మరణం

టి.నరసాపురం, అక్టోబరు 14: కలుపుమందు తాగి యువకుడు పిన్నిబోయిన పృథ్వి (23)మృతి చెందాడు. తెడ్లం గ్రామానికి చెందిన పిన్నిబోయిన సుబ్బారావు రెండో కుమారుడు పృథ్వి రెండు సంవత్సరాలుగా స్థానికంగా పురుగులమందు షాపులో పని చేస్తున్నాడు. రెండు నెలలుగా తండ్రిని స్పోర్ట్స్ బైక్ కొనమని అడుగుతుండగా అప్పులు ఉన్నాయని తీరాక కొంటానని చెబుతుండటంతో మనస్థాపానికి గురైన యువకుడు ఈనెల 12న రాత్రి కలుపు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అతనిని చింతలపూడి ఆసుపత్రికి తరలించగా అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం ఏలూరు తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ జయరాజు తెలిపారు.

క్రైమ్ కార్నర్

మనస్థాపంతో వృద్ధురాలి ఆత్మహత్య

భీమవరం క్రైం, అక్టోబరు 14 : ఒకపక్క అనారోగ్యం, మరోపక్క కుమార్తెకు, కుమారుడికి వివాహం కావట్లేదనే మనస్తాపంతో వృద్ధురాలు చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. భీమవరం వన్‌టౌన్ హెచ్‌సీ చక్రవర్తి తెలిపిన వివరాలు ప్రకారం గునుపూడికి చెందిన కోన సీతామహాలక్ష్మి (62) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. దానికి తోడు ఇద్దరు పిల్లలకు వివాహం కావట్లేదనే బెంగ కూడా ఉంది. కుమారుడు మురళీకృష్ణ సోమవారం ఉదయం లేచేసరికి తల్లి కనిపించలేదు. చుట్టుపక్కల వెతుకుతుండగా అటుగా వెళుతున్న వ్యక్తి ఎవరో మహిళ మృతదేహం సోమగుండం చెరువులో తేలుతుందని చెప్పడంతో వెళ్ళి చూడగా తన తల్లి మృతదేహంగా గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ చక్రవర్తి తెలిపారు.



కారు ఢీకొని భర్త మృతి, భార్యకు గాయాలు

ఉంగుటూరు, అక్టోబరు 14 : జాతీయ రహదారిపై బాదంపూడి వైజంక్షన్ వద్ద సోమవారం రోడ్డు ప్రమాదంలో భర్త మృతి చెందగా భార్యకు తీవ్రగాయాలయ్యాయి ఉంగుటూరు మండలం బొమ్మిడి గ్రామానికి చెందిన యర్రా పెద్దిరాజు, భార్య నాగమణితో కలిసి మోపెడ్‌పై ఉంగుటూరు వెళ్లారు. తిరిగి బొమ్మిడి వెళుతున్న సమయంలో బాదంపూడి వై జంక్షన్ వద్ద రావుల పాలెం నుంచి హైదరాబాదు వెళ్తున్న కారు ఢీకొంది. దీంతో యర్రా పెద్దిరాజు (60) అక్కడికక్కడే మృతి చెందగా, భార్య నాగమణికి తీవ్ర గాయాలయ్యాయి. నాగమణిని హైవే అంబులెన్స్‌లో తాడేపల్లిగూడెం ఏరియా అసుపత్రికి తరలించారు. చేబ్రోలు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

భీమవరం క్రైం, అక్టోబరు 14 : (ఆంధ్రజ్యోతి) ద్విచక్ర వాహనం ఢీకొని తీవ్రంగా గాయపడిన మహిళ చికిత్స పొందుతూ మృతి చెందింది. భీమవరం రూరల్ హెచ్‌సీ మహేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని కొవ్వాడ గ్రామానికి చెందిన మేడపాటి చంద్రలీల (50) కూలి పనులకు వెళుతూ జీవనం సాగిస్తున్నది. ఈనెల 10న కూడా కూలి పనులకు వెళుతుండగా అదే గ్రామానికి చెందిన వింజరపు వెంకట పవన్‌కుమార్ అనే వ్యక్తి ద్విచక్ర వాహనంతో చంద్రలీలను ఢీకొట్టాడు. ఆమెకు తీవ్ర గాయాలు కాగా ఆసుపత్రి తలరించారు. మరుసటి రోజు పోలీసులు కేసు నమోదు చేశారు. చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి ఆమె మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ తెలిపారు.

కొట్లాటపై ఇరు వర్గాలపై కేసు నమోదు

పాలకోడేరు, అక్టోబరు 14: సరిహద్దు తగాదా విషయమై కొట్లాట జరిగిన సంఘటనపై ఇరు వర్గాలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పాలకోడేరు హెడ్‌కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు తెలిపారు. పెన్నాడపాలెంకు చెందిన బొర్రా రమేష్ తల్లికి బాగోగకపోవడంతో ఆసుపత్రికి ఆటో పై తీసుకెళ్ళేందుకు సిద్ధపడ్డాడు. అయితే సరిహద్దులో ఉన్న ఆరేపల్లి వెంకటేశ్వరరావు సరిహద్దులో ఉన్న పోల్స్ అడ్డుగా ఉండటంతో బొర్రా రమేష్, బొర్రా చంద్రరావు, బొర్రా ప్రసన్నలు వాటిని తొలగించారు. ఆరేపల్లి వెంకటేశ్వరరావు పోల్స్‌ను ఎలా తొలగిస్తారని అడ్డువెళ్ళారు. మాటమాట పెరిగి ఆరేపల్లి వెంకటేశ్వరరావు రమేష్, చంద్రరావుపై చాకుతో దాడి చేశాడు. దీంతో వారికి గాయాలు కావడంతో ఆసుపత్రి నుంచి వచ్చిన నివేదిక ఆధారంగా బొర్రా రమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆరేపల్లి వెంకటేశ్వరరావుపై కేసు నమోదు చేశామన్నారు. ఇదే కేసులో ఆరేపల్లి వెంకటేశ్వరరావును చంపుతామని బెదిరించడంతో వెంకటేశ్వరరావు పురుగుల మందు తాగి ఆసుపత్రిపాలయ్యాడు. ఈ కేసులో వెంకటేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదుపై బొర్రా రమేష్, బొర్రా చంద్రరావు, బొర్రా ప్రసన్నలపై కేసు నమోదు చేశామని హెడ్‌కానిస్టేబుల్ వెంకటేశ్వరరావు సోమవారం తెలిపారు.





బోల్తా పడిన ఆర్టీసీ బస్సు... ప్రమాదంలో మృతి చెందిన విమలాబాయి

ఆర్టీసీ బస్సు బోల్తా ..ఒకరి మృతి

17 మందికి గాయాలు



చింతలపూడి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు జిల్లా చింతలపూడి మండలం డి.ఎన్ రావుపేట సమీపంలో హైదరాబాదు నుండి చింతలపూడి మీదుగా ఏలూరు వెళ్ళే సూపర్ లగ్జరీ ఏలూరు డిపోకు చెందిన ఆర్టీసి బస్సు అదుపు తప్పి సోమవారం తెల్లవారు జామున బోల్తా పడింది. బస్సులో 36 మంది ప్రయా ణిస్తున్నారు. ఇందులో ఏలూరుకు చెందిన పెందుర్తి విమలాబాయి (74) మృతి చెందగా మరో 17 మందికి గాయాలయ్యాయి. క్షత గాత్రు లను చింతలపూడి ఏరియా ఆసుపత్రికి తర లించారు. స్వల్పగాయాలైన 13 మందికి చికిత్స చేశారు. కాగిత స్వరూప, పెందుర్తి సియోను, కుమారి, ఎం.రిషిత, గాలంకి శిరీష లకు తీవ్ర గాయాలు కావడంతో చికిత్స జరిపి ఏలూరు తరలించారు. మరో పది నిమిషాల్లో బస్సు చింత లపూడి సెంటర్‌కు చేరుతుందనగా డి.ఎన్. రావుపేట దాటిన తరువాత మలుపు తిరుగుతూ వేగంగా బస్సు అదుపు తప్పడంతో బోల్తా పడి కొంత దూరం దూసుకుపోయింది. ఈ మార్గం లోనే వెనుక వస్తున్న ఆర్టీసి బస్సు ప్రమాదాన్ని చూసి బోల్తా పడిన బస్సు వెనుకవైపు అద్దాలు పగులకొట్టి క్షతగాత్రులు కొందరిని ఎక్కించుకుని మరికొందరిని ఆటోల్లో ఏరియా ఆసుపత్రికి తరలించారు. జీడిమెట్ల నుంచి ఈ సర్వీసు ఖమ్మం, సీతానగరం, చింతలపూడి మీదుగా ఏలూరు వెళ్ళాల్సి ఉంది. అయితే ఈ మార్గంలో రోడ్లు బాగోలేకపోవడంతో గత కొన్ని రోజులుగా సత్తుపల్లి, గురుభట్లగూడెం మీదుగా చింత లపూడి రాకపోకలు సాగిస్తున్నాయి. బస్సు మలుపులో ఎడమవైపుకు అదుపు తప్పి బోల్తా పడి కొద్ది దూరం ఈడ్చుకుపోయిందని ప్రయాణికులు చెబుతున్నారు.

పది నిమిషాల్లో గమ్యం..

బస్సు బోల్తా ప్రమాదంలో గాయపడిన వారిలో నలుగురు ఒకే కుటుంబానికి చెందిన వారు.దసరా సెలవులు కావడంతో నాలుగురోజుల క్రితం పెందుర్తి విమలాబాయి, ఆమె ముగ్గురు కుమార్తెలు, ఇద్దరు పిల్లలు హైదరాబాదులో బంధువుల ఇళ్ళకు వెళ్ళారు. సెలవులు పూర్తికావడంతో తిరిగి వస్తూ ఈ ప్రమాదానికి గురయ్యారు. ఇందులో మృతురాలి కూతురైన స్వర్ణలత చింతలపూడి ప్రభుత్వ జూని యర్ కళాశాల విద్యార్థినుల సంక్షేమ హాస్టల్ వార్డెన్‌గా పనిచేస్తున్నారు. వీరంతా ఒకే బస్సు ఎక్కారు. స్వర్ణలత చింతలపూడిలో దిగిపోతుంది, తామంతా ఏలూరుకు చేరుకోవచ్చని బస్సులో ప్రయాణించారు. పది నిమిషాల్లో చింతలపూడి వస్తుందనగా ముగ్గురు కుమార్తెలు లగేజీలు తీసుకోవడానికి సిద్ధమవుతుండగా ప్రమాదం జరిగి విషాదాన్ని నింపింది.

ఏలూరు-చింతలపూడి మీదుగా..

హైదరాబాదుకు ఆరు ఆర్టీసీ సర్వీసులు, రెండు ప్రైవేటు స్లీపర్ సర్వీసులు నడుస్తున్నాయి. 25 సంవత్సరాల్లో ఎన్నడూ ఇటువంటి ప్రమాదం ఈ ప్రాంతంలో హైదరాబాదు వెళ్ళే సర్వీసులో తాము చూడలేదని స్థానికులు చెబుతున్నారు. ఏలూరు నుంచి చింతలపూడి మీదుగా వెళ్లే బస్సులు కూడా గ్రామీణ ప్రాంతాలను టచ్ చేసుకుంటూ చింతలపూడి చేరుకుని వెళ్తుంటాయి. దీంతో నేరుగా ఆయా గ్రామాల్లో ప్రయాణికులు దిగుతుంటారు. ఈ ప్రమాదం చూసి పలువురు ఉలిక్కిపడ్డారు. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రవీంద్ర మాట్లాడుతూ బస్సువేగంగా వెళ్తూ మలుపు తిరిగిన సమయంలో అదుపు తప్పడంతో ప్రమాదానికి గురైందని చెప్పారు. డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నామని, మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించామని చెప్పారు. చింతలపూడి ఎమ్మెల్యేసొంగా రోషన్‌కుమార్ ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించారు.

ప్రయాణికుల రద్దీ.. బస్సు సర్వీసులు పెంచిన ఆర్టీసీ


ప్రయాణికులతో మాట్లాడుతున్న ఆర్టీసీ అధికారులు

ఏలూరు క్రైం, అక్టోబరు 14: దసరా సెలవులు ముగియడంతో ప్రయాణికుల రద్దీ దృష్ట్యా జిల్లా ప్రజా రవాణాధికారి వర ప్రసాద్ ఆధ్వర్యంలో ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఏలూరు కొత్తబస్టాండ్‌లో సోమవారం వేకువజాము నుంచే ప్రయాణికుల రద్దీ ఉండడంతో వర ప్రసాద్, డీఎం బి.వాణి, సిబ్బంది ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా బస్సులను ఏర్పాటు చేశారు. విజయవాడకు అదనంగా 20 నాన్‌స్టాప్ బస్సులను పంపించారు. హైదరాబాద్‌కు అదనంగా 13 సర్వీసులను ఏర్పాటు చేసి అప్పటికప్పుడే టిక్కెట్లను జారీ చేశారు. విజయవాడ వైపు నాన్‌స్టాప్ కౌంటర్ల వద్ద అదనంగా కౌంటర్లను ఏర్పాటు చేసి టిక్కెట్లను జారీ చేశారు.

ప్రైవేటు వాహనాల్లో ప్రయాణాలు

పోలవరం: మండలంలో ఆర్టీసీ సర్వీసులు తగినంత లేక ప్రయాణికులు ప్రైవేటు వాహనాలను ఆశ్రయించారు. అధిక చార్జీలు వెచ్చించి గమ్యస్థానాలకు చేరుకున్నారు. దసరా సెలవుల అనంతరం ఒక్కసారిగా రద్దీ నెలకొంది. రాజమహేంద్రవరం, నిడదవోలు, జంగారెడ్డిగూడెం తగినన్ని బస్సులు లేకపోవడంతో బస్సుల కోసం ఎదురుచూసి ఆటోలు, ప్రైవేటు వాహనాల్లో వెళ్లారు.

సచివాలయ సెక్రటరీల సమస్యలు పరిష్కరించాలి

ఏలూరు టూటౌన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): గ్రామ, వార్డు సచివాలయాల్లో హెల్త్ సెక్రటరీల సమస్యలు పరిష్కరించాలని ఏపీ యునైటెడ్ గ్రామ, వార్డు, హెల్త్ సెక్రటరీస్ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు డీఎస్‌వీడీ ప్రసాద్ విజ్ఞప్తి చేశారు. కలెక్టరేట్‌లో పరిపాలనాధికారికి సోమవారం వినతిపత్రం సమర్పించారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో సచివాలయ ఉద్యోగులు ఎన్నో సమస్యలు ఎదుర్కొన్నారని, కూటమి ప్రభుత్వం వాటిని పరిష్కరించాలని కోరారు. ఎంపీహెచ్ఏలకు పదోన్నతులు కల్పించాలన్నారు. కార్యక్రమంలో లీలాదేవి, విజయదేవి పాల్గొన్నారు.

పశువులను వీధుల్లో వదిలిన యజమానులపై చర్యలు

ఏలూరు టూటౌన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): నగరంలో రహదారులు, వీధుల్లో సంచరిస్తున్న పశువుల యాజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని నగరపాలక సంస్థ కమిషనర్ ఎ.భానుప్రతాప్ హెచ్చరించారు. ఆవులు, గేదెలు, ఎద్దులను రహదారులపై విడిచిపెట్టడం వలన ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతుందన్నారు. వీధుల్లో కనపడిన పశువులను గోసంరక్షణ సమితులకు తరలించి యజమానులపై చర్యలు తీసుకుంటామన్నారు. తరలించడానికి, పోషణ ఖర్చు వారి నుంచి వసూలు చేస్తామన్నారు.

పందుల పెంపకందారులకు కంపోస్టు యార్డులో స్థలం కేటాయించినట్లు కమిషనర్ భానుప్రతాప్ తెలిపారు. నగరంలో పందుల సంచారంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. హైకోర్టు ఆదేశాల మేరకు పందుల కోసం పోణంగిలో స్థలాన్ని కేటాయించామని అన్నారు.

మద్యం దుకాణాలను ఎస్టీలకే కేటాయించాలి

బుట్టాయగూడెం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): షెడ్యూల్ ప్రాంతంలో మద్యం షాపుల కేటాయింపు కోసం పీసా గ్రామ సభలను సంప్రదించి స్థానిక గిరిజనులకే షాపులను కేటాయించాలని ఆదివాసీ జేఏసీ కమిటీ చైర్మన్ మొడియం శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. బుట్టాయగూడెంలో సోమవారం ఆదివాసీ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. షెడ్యూల్ ప్రాంతంలో పీసా గ్రామసభల ద్వారానే మద్యం షాపుల ఏర్పాటు జరగాలని, పీసా చట్టం ప్రకారం గ్రామసభకు మాత్రమే పూర్తి అధికారం ఉందన్నారు. షాపుల ఏర్పాటు కూడా గిరిజనులు చేపట్టాలని స్పష్టంగా ఉందన్నారు. ఎక్సైజ్ పాలసీలో షెడ్యూల్ ప్రాంతం ప్రస్తావన లేకపోవడంతో దురదృష్టకరమన్నారు. ప్రభుత్వం ఆదివాసీలపై చులకన భావంతో వ్యవహరిస్తుందని తెలిపారు. సోడెం ముక్కయ్య, రవ్వ బసవరాజు, పొడియం కొవ్వాడయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రొఫెసర్ సాయిబాబా మృతికి సంతాపం

టి.నరసాపురం, అక్టోబరు 14: ఢిల్లీ యూనివర్శిటీ మాజీ ప్రొఫెసర్ గోకరకొండ నాగ సాయిబాబా మృతికి ప్రజా నాట్య మండలి జిల్లా సబ్ కమిటీ కన్వీనర్ టీవీఎస్ రాజు, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా గౌరవాధ్యక్షుడు సబ్బి కనకారావు సంతాపం తెలిపారు. బొర్రంపాలెంలో వీరమల్ల సత్యనారాయణ నివాసం వద్ద సోమవారం విలేకరులతో మాట్లాడారు. విజ్ఞానంతో అన్యాయాన్ని చేదించి పేదల హృదయాల్లో నిలిచిన మహోన్నత వ్యక్తి అన్నారు. ఆయనపై రాక్షస ప్రభుత్వాలు అక్రమ కేసులు పెట్టి హింసించారని ఆవేదన వ్యక్తం చేశారు. జైల్లో ఆయనకు కనీస వైద్య సహాయం అందించకపోవడంతో తీవ్ర అనారోగ్యం పాలయ్యారన్నారు. ఆయన మృతికి ప్రభుత్వమే నైతిక బాధ్యత వహించాలన్నారు. ఎల్ఆర్ కృష్ణబాబు, తోట లక్ష్మీనారాయణ, తోట సత్యనారాయణ, బొందలపాటి పద్మావతి, సిరిగినీటి జగదీశ్వరి తదితరులు సంతాపం తెలిపారు.


కె.కోట మండలంలో శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రోషన్‌కుమార్


విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే చంటి


బాదంపూడిలో రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ధర్మరాజు

పల్లెల్లో అభివృద్ధి

అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యేలు

కామవరపుకోట, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో అభివృద్ధి పనులు పండుగలా చేపట్టారు. ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణాలకు ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ సోమవారం శంకుస్థాపన చేశారు. తడికలపూడి, వీరిశెట్టిగూడెం, ఆడమిల్లి, తాడిచర్ల, గుంటుపల్లి, ఉప్పలపాడు, రావికంపాడు గ్రామాల్లో రోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు కిలారు సత్యనారాయణ, ఘంటా మురళీ రామకృష్ణ, కరాటం రాంబాబు, కోనేరు వెంకట సుబ్బారావు, తూతా లక్ష్మణరావు, ఘంటా సుధీర్‌బాబు, సర్పంచ్‌లు గూడపాటి కేశవరావు, పసుమర్తి పార్థసారధిబాబు, గోరింక దాసు, వేముల నాగేశ్వరరావు, జనసేన మండల అధ్యక్షుడు షేక్ వలీ, బీజేపీ మండల అధ్యక్షులు బాలవర్ధిరాజు పాల్గొన్నారు.

కొయ్యలగూడెంలో..

కొయ్యలగూడెం: గ్రామాల అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు అన్నారు. కన్నాపురం, దిప్పకాయలపాడు, బిల్లిమిల్లి, అంకాలగూడెం గ్రామాల్లో రోడ్లకు ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాస్‌తో కలిసి శంకుస్థాపనలు చేశారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కూటమి ప్రభుత్వం పరిపాలన కొనసాగిస్తుందన్నారు. ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాస్ మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టామన్నారు. ఉపాధి హామీ పనులతో పొలాలకు వెళ్లే రహదారులు కూడా నిర్మిస్తున్నామని తెలిపారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం ముందుకు వెళుతుందన్నారు. కూటమి నాయకులు గొడవర్తి విద్యాసాగర్, ఎస్ఆర్ఆర్.నరసింహరాజు, దుగ్గిన శ్రీను, కాకర్ల నంది, మాదేపల్లి శ్రీను, కన్నాపురం సర్పంచ్ పద్మావతి, దిప్పకాయలపాడు సర్పంచ్ సున్నం శాంతకుమారి, ఎంపీటీసీలు బాజీ, గణపతి, కసుకుర్తి ఉమా పాల్గొన్నారు.

సబ్ స్టేషన్ నిర్మాణం..

ఏలూరు టూటౌన్: ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటిని నెరవేరుస్తాన్నామని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. కొత్తూరు ఇందిరమ్మ కాలనీలో రూ.4.5కోట్లతో నిర్మించనున్న విద్యుత్ ఉప కేంద్రానికి ఎమ్మెల్యే చంటి భూమి పూజ నిర్వహించారు. లోఓల్టేజ్ సమస్య పరిష్కారానికి సబ్ స్టేషన్ నిర్మిస్తున్నామన్నారు. వచ్చే ఏడాది మార్చి నాటికి టిడ్కో గృహాలు అందుబాటులోకి తెస్తామన్నారు. ట్రాన్స్‌కో ఎస్ఈ సాల్మన్ రాజు, ఈఈలు శశిధర్, కేఎం.అంబేద్కర్, ఏడీఈ శ్రీనివాస్, ఏఈ రాంబాబు, పైడి వెంకట్రావు, వై.నాగబాబు, బెల్లంకొండ కిశోర్, ఆర్నేపల్లి తిరుపతి, అమరావతి అశోక్, తదితరులు పాల్గొన్నారు.

ఉంగుటూరు మండలంలో..

ఉంగుటూరు: మండలంలోని పలు గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు శ్రీకారం చుట్టారు. వెల్లమిల్లి, చేబ్రోలు, గోపీనాథపట్నం, రామచంద్రపురం, బాదంపూడి, ఉప్పాకపాడు గ్రామాల్లో రూ66.5లక్షలతో చేపట్టే సీసీ రహదారుల పనులకు ఎమ్మెల్యే ధర్మరాజు భూమి పూజ చేశారు. సర్పంచ్‌లు వస్కా కుమార్ రాజా, రాంధే లక్ష్మీసునీత, పుత్సకాయల విష్ణు, నేదునూరి వీర వెంకట మోహనరావు, ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి, ఎంపీటీసీలు ఇంటి మంగరాజు, ఎంపీడీవో గంజి రాజ్ మనోజ్ తదితరులు పాల్గొన్నారు. చేబ్రోలు సబ్ స్టేషన్‌లో సప్లై బ్రేకర్ చార్జర్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. డీఈ కెఎం.అంబేడ్కర్, డీఈఈ రామకృష్ణ, ఏఈ వేణు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు శిక్షణ

ఏలూరు అర్బన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని నిరుద్యోగ యువతకుఆఫీస్ ఆపరేషన్స్ ఎగ్జిక్యూటివ్ కోర్సులో ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన కింద మూడు నెలల శిక్షణకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు డీఎల్‌టీసీ/ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ రవి సోమవారం తెలిపారు. ఇంటర్, ఆపైన విద్యార్హతలతో 15-35ఏళ్లలోపు అభ్యర్థులు శిక్షణకు అర్హులని వివరించారు. ఈ నెల 25లోగా దరఖాస్తుచేసుకోవాలని, వివరాలకు 94934 82414లో సంప్రదించాలని కోరారు.

ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలి

లింగపాలెం, అక్టోబరు 14: ప్రజలు వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలని, ఆరోగ్యంపై పలు జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్ యానిప్రీతి అన్నారు. ధర్మాజిగూడెంలో సోమవారం వైద్యశిబిరం నిర్వహించారు. ప్రతిరోజూ గ్రామాల్లో ఫీవర్‌సర్వే నిర్వహించాలని వైద్య సిబ్బందికి సూచించారు. జ్వరం, తలనొప్పి ఉంటే వెంటనే డాక్టర్‌ను సంప్రదించేలా చూడాలన్నారు. ఆమెతో పాటు డాక్టర్ ప్రియాంక, పలువురు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు 50 శాతం సబ్సిడీపై టార్పాలిన్లు అందించాలి

ఉంగుటూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ పంట చేతికొచ్చే సమయంలో తుపాన్లు, భారీ వర్షాల వలన పంట మాసూళ్లకు ఇబ్బంది కలుగకుండా ఉండేందుకు రైతులకు 50 శాతం సబ్సిడీపై టార్పాలిన్లు అందించాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కే.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. కైకరంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కట్టా భాస్కరరావు అధ్యక్షతన రైతు సంఘం ముఖ్య నాయకుల సమావేశం సోమవారం నిర్వహించారు. శ్రీనివాస్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలులో ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో గుత్తికొండ వెంకట కృష్ణారావు, కౌలు రైతు సంఘం జిల్లా కన్వీనర్ కొర్ని అప్పారావు పాల్గొన్నారు.

హామీలను అమలు చేయాలి

బుట్టాయగూడెం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకిచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు మంతెన సీతారాం డిమాండ్ చేశారు. సీపీఎం జిల్లా మహాసభల సన్నాహక సమావేశం తెల్లం రామకృష్ణ అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ఉచిత ఇసుక అమలుకు ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పోలవరం నిర్వాసితులకు పునరావాసం, పరిహారం ఇవ్వాలన్నారు. డిసెంబరు 13, 14, 15 తేదీల్లో బుట్టాయగూడెంలో సీపీఎం 26వ జిల్లా మహాసభలు జరుగుతున్నట్లు నాయకులు తెలిపారు.

ఆవుల అక్రమ రవాణా

ఏలూరు క్రైం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఆవులు, దూడలను అక్రమంగా రవాణా చేస్తున్నారని ఇద్దరు వ్యక్తులపై త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. మినీ బైపాస్ రోడ్డులో ఆదివారం రాత్రి వేళ ఒక వ్యానులో 3 ఆవులు, 3 దూడలను వాహనంలో తరలిస్తుండగా ఏలూరుకు చెందిన గో రక్షక్ దళ సభ్యులు అడ్డుకుని పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వ్యాన్, పల్నాడుజిల్లా కోసూరి మండలం ఆవులూరిపాలెంనకు చెందిన డ్రైవర్ తిరుమల అశోక్ (27)పై ఆవులను పంపించిన రావులపాలెంనకు చెందిన తిరుమల బ్రహ్మయ్యపై కేసు నమోదు చేశారు. వీటిని రావులపాలెం నుంచి సత్రంపాడునకు పంపిస్తున్నట్లుగా చెబుతున్నారు. వీటి రవాణాలో సరైన జాగ్రత్తలు తీసుకోలేదని అనుమతులు లేకుండా రవాణా చేస్తున్నారని గుర్తించి కేసు నమోదు చేశారు.

సారా స్థావరాలపై దాడి

కుక్కునూరు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): పెదరావిగూడెంలో సారా స్థావరాలపై సోమవారం సీఐ రమేష్‌బాబు ఆధ్వర్యంలో దాడులు చేశారు. పానగళ్ళ రమణ వద్ద 5లీటర్ల సారా పట్టుకున్నారు. సారా సరఫరా చేస్తున్న ఎన్.సురేష్‌పై కేసు నమోదు చేశారు. సారా విక్రయిస్తున్న రమణపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలించారు. దాడుల్లో హెచ్‌సీ నాగేశ్వరరావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.


డీటీసీలో తరగతి గదులు, సిబ్బంది రోల్‌కాల్‌ను పరిశీలిస్తున్న డీటీసీ ప్రిన్సిపాల్ సూర్యచంద్రరావు

పోలీసు సిబ్బందికి సాంకేతిక పరిజ్ఞానం అవసరం

పెదవేగి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): పోలీస్ సిబ్బంది సాంకేతిక పరిజ్ఞానం, నైపుణ్యాన్ని అందిపుచ్చుకోవాలని జిల్లా పోలీస్ శిక్షణ కేంద్రం (డీటీసీ) ప్రిన్సిపాల్, ఏఎస్పీ(అడ్మిన్) ఎన్.సూర్యచంద్రరావు అన్నారు. ప్రిన్సిపాల్ హోదాలో ఏఎస్పీ సూర్యచంద్రరావు సోమవారం డీటీసీని సందర్శించారు. శిక్షణ వివరాలు, సిబ్బందికి కల్పిస్తున్న వసతులు, సౌకర్యాలు, తరగతి గదులు, డ్రిల్ నిర్వహించే గ్రౌండ్‌ను ఆయన పరిశీలించారు. ఎంతమందికి, ఏఏ అంశాల్లో శిక్షణ ఇచ్చారు. ఎలాంటి శిక్షణ ఇస్తే ఇంకా మెరుగైన ఫలితాలను అందుకునే అవకాశం ఉంటుందని ఆయన అధికారులను అడిగి తెలుసుకున్నారు. నేరాల నియంత్రణలో ఆధునిక, సాంకేతిక పరిజ్ఞానం ఎంతో కీలకమన్నారు. పోలీస్ విధులు నిర్వర్తించే ప్రతి ఒక్కరూ సాంకేతిక పరిజ్ఞానాన్ని కలిగి ఉండాలన్నారు. నేరస్తులు కూడా విభిన్న పద్ధతులను అనుసరిస్తున్నారని, వాటిని అరికట్టడంలో పోలీస్ వ్యవస్థ సాంకేతిక పరిజ్ఞానాన్ని మెరుగుపర్చుకుంటుందన్నారు. చట్టంలో మార్పులు, చేర్పులను సిబ్బందికి తెలియజేస్తూ నేర నియంత్రణలో శిక్షణ కేంద్రాలు దోహదపడతాయని ఏఎస్పీ సూర్యచంద్రరావు వివరించారు. డీటీసీ సీఐ రామారావు, ఎస్ఐలు విజయ్ కుమార్, శ్రీనివాసరావు, ఏఎస్ఐ రంగారావు, సిబ్బంది పాల్గొన్నారు.

వరద బాధితులకు న్యాయం చేయాలి



పాత బస్టాండ్ సెంటర్‌లో ఆందోళన చేస్తున్న నాయకులు, కార్యకర్తలు

ఏలూరు కార్పొరేషన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): విజయవాడ వరద ఖర్చుల్లో అవినీతి ఆరోపణలపై విచారణ జరిపించాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసి ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసి నగర కార్యదర్శి బద్దావెంకట్రావు మాట్లాడుతూ వరద పరిహారాలు ఇచ్చేటప్పుడు బాధిత కుటుంబాల సంఖ్య వేలల్లో చూపించారన్నారు. వరద సందర్భంగా ప్రభుత్వ ఖర్చులు కేవలం లక్షల లోపు కుటుంబాలకు అందిస్తే కోటి మందికి భోజనాలతో 368 కోట్లు ఖర్చు పెట్టినట్టు చూపించారన్నారు. ఖర్చుల విషయాలపై హైకోర్టు న్యాయమూర్తులతో విచారణ జరిపించాలని కోరారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ నగర ప్రధాన కార్యదర్శి యర్రా శ్రీనివాసరావు, సహాయ కార్యదర్శి గడసాల రాంబాబు, ముంగం అప్పారావు, కాకి నాని, ఎం.క్రాంతి, జాన్, నెహ్రూబాబు, బుడత వీరభద్రం, ఎన్.ప్రసాద్, పండు, పెద్దిశెట్టి గంగరాజు, డానియేలు, భాస్కర్, పి.శ్రీను పాల్గొన్నారు.

● జంగారెడ్డిగూడెం, విజయవాడ వరద బాధితులకు నష్టపరిహారం పంపిణీపై ప్రభుత్వం సమగ్ర రీసర్వే జరపాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకుడు కారం రాఘవ డిమాండ్ చేశారు. ఆర్డీవో కార్యాలయ కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం సమర్పించారు. వరద బాధితులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలు ఏమీ నెరవేర్చలేదన్నారు. కార్యక్రమంలో కేవీ.రమణ, ఎస్.రామ్మోహన్, ఈ.భూషణం, న్యాయవాది యు.ఏసుబాబు పాల్గొన్నారు.

తప్పుడు కేసులను ఎత్తివేయండి

బుట్టాయగూడెం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): తమపై గిరిజనేతరులు పెట్టిన తప్పుడు కేసులను ఎత్తివేయాలని సోమవారం ఐటీడీఏలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో గిరిజనులు వినతిపత్రం అందజేశారు. సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ(చంద్రన్న వర్గం) ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. గిరిజనులకు న్యాయం చేయాలని కోరారు. సాలి రాజశేఖర్, పూనెం పార్వతి, పాయం భూలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

కొత్తవాళ్లకే కిక్

(ఐదో పేజీ తరువాయి)

చుక్కెదురైంది. జంగారెడ్డిగూడెం కేంద్రంగా ఏర్పడిన సిండికేట్‌లు పెద్ద సంఖ్యలో దుకాణాల కోసం దరఖాస్తు చేశాయి. భీమవరం, అరకు వంటి ప్రాంతాల్లో కూడా దుకాణాల కోసం ఈ సిండికేట్‌లలో ఉన్న కొందరు పోటీగా దరఖాస్తులు పంపారు. కాని లాటరీలో వీరు ఆశించినట్టు దుకాణాలు దక్కక పోవడంతో ఈ సిండికేట్‌లన్నీ కోట్ల రూపాయలు నష్టపోయాయి. సిండికేట్‌లలో పెట్టుబడి పెట్టినవారంతా మధ్యాహ్నం నాటికే తగినన్ని దుకాణాలు లభించక బావురమన్నారు. దెందులూరు నియోజకవర్గం నువ్వానేనా అన్నట్టుగా మద్యం దుకాణాలకు దరఖాస్తు చేసుకున్నా అదృష్టం కొందరికే వరించింది. మద్యం దుకాణాలపై ఎంతో పెట్టుబడి పెట్టి రంగంలోకి దిగిన వారికి నిరాశే మిగిలింది.

కొత్త ముఖాలకే లక్కు

మద్యం వ్యాపారంలో ఈసారి కొత్త ముఖాలకే లక్కు వరించింది. ఈ వ్యాపారంలో రూపాయికి రూపాయి మిగులుతుందన్న ఆశతో పెద్ద ఎత్తున దుకాణాలకు దరఖాస్తు చేసుకున్నారు. ఒకవైపు సిట్టింగ్ ఎమ్మెల్యేల భయం ఉన్నా.. సిండికేట్ల అదురున్నా ఖాతర్ చేయకుండా కులాలకతీతంగా దరఖాస్తులు చేశారు. పెద్ద విచిత్రం ఏంటంటే అసలు మద్యం వ్యాపారమంటేనే చీదరించుకునే కుటుంబాలకు చెందిన వారు కూడా ఈసారి దుకాణాల కోసం దరఖాస్తు చేయడం అనూహ్యంగా వారే లాటరీ కొట్టడం అందరినీ ముక్కున వేలేసుకునేలా చేసింది. అంతకంటే మించి కొత్తైనా అదృష్టవంతులురా.. అంటూ మిగతావారంతా కాస్తంత అసూయతోనే వ్యాఖ్యలు చేశారు. మొత్తం 144 దుకాణాల్లో కొత్త ముఖాలకే చోటు దక్కడం మద్యం విధానంలో సరికొత్త అనుభవం. వీరంతా కొత్త ముఖాల్లో ఎక్కడికక్కడ సోమవారంనాడే మిగతా వారితో కలుపుకుని వ్యాపారం చేయడానికి వాటాలకు కొన్ని సెంటర్లలో తెరలేపారు. ఎవరికైతే దుకాణం లభిస్తుందో వారితో ఇంకొందరు క్షణాల్లో సంప్రదింపులు జరిపారు. తమకు ఇంత వాటా ఇస్తే అప్పటికప్పుడు ముందస్తు సొమ్ము చెల్లించడానికి సిద్ధపడ్డారు. మద్యం దుకాణాల లాటరీ జరుగుతున్న ప్రాంతంలో కార్లలోనే లక్షలాది రూపాయలు ఉండడంతో అనేకమంది ఆ కార్లకు గస్తీ కాశారు. కార్లు విడిచి వెళ్లకూడదంటూ డ్రైవర్లందరినీ కట్టడి చేయడం కనిపించింది.

చేతిలో డబ్బు పోయెనే..

మద్యం దుకాణం కోసం అర్రులుచాచి అనేక మంది కోట్లాది రూపాయలు చేజార్చుకున్నారు. పోటాపోటీగా దుకాణాలు సొంతం చేసుకోడానికి సిండికేట్‌లుగా, వ్యక్తిగతంగా రంగంలోకి దిగి ఏదొక రూపంలో దుకాణం సొంతమైతే చాలని తెగ రెచ్చిపోయారు. లాటరీలో 30-40 దుకాణాలకు దరఖాస్తు చేసుకుని ఉంటే కనీసం ఏడు, ఎనిమిది దుకాణాలు సొంతంకావడం ఖాయమనే ధీమాతో రంగంలోకి దిగిన వారికి ఎక్సైజ్ లాటరీ షాక్ ఇచ్చింది. అదృష్టం ముఖం చాటేసింది. ఈ వ్యాపారంతో సంబంధం లేకపోయినా కొందరు వ్యాపారులు, ఉద్యోగులు, ఆఖరుకు ప్రైవేటు సంస్థల్లో పనిచేస్తున్న వారు సైతం తాము కూడబెట్టిన దానిలో రెండు లక్షలు చొప్పున సిండికేట్‌లకు అందజేశారు. వస్తే రెండేళ్ళ పొడవునా తలొక రూపాయి వస్తుందని ఆశలు పెంచుకోగా అవన్నీ ఆవిరయ్యాయి. జిల్లా వ్యాప్తంగా దాదాపు 350 మంది కొత్తగా తమ చిన్న మొత్తాలను ఈరూపంలో పెట్టుబడి పెట్టి చేతులు కాల్చుకున్నారు. సిండికేట్‌లలో ఉన్న కొందరు తమ అదృష్టానికి తిరుగులేదని భావించి మరీ పదుల సంఖ్యలో దరఖాస్తులు చేసుకోగా వారికి షాక్ తగిలింది.

ప్రశాంతంగా లక్కీడిప్ : కలెక్టర్

ఏలూరు క్రైం : జిల్లాలో మద్యం దుకాణాల కేటాయింపు లక్కీడిప్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసిందని కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. లాటరీ ముగిసిన తర్వాత కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రశాంతంగా పారదర్శకంగా మద్యం దుకాణాల కేటాయింపు లక్కీడిప్ ప్రక్రియ పూర్తయింది. పూర్తి ప్రక్రియను వీడియో చిత్రీకరించాం. షాపులకు దరఖాస్తు చేసిన వారి సమక్షంలో లక్కీడిప్ తీసి దక్కించుకున్న వారి పేరు ప్రకటించామని తెలిపారు. ఎక్సైజ్‌శాఖ డిప్యూటీ కమిషనర్ బి.శ్రీలత, జేసీ ధాత్రిరెడ్డి, జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎ.ఆవులయ్య, ఏఎస్పీ ఎన్.సూర్యచంద్రరావు, ఇన్‌చార్జి డీఆర్వో దేవకి దేవి, ఆర్డీవో అచ్యుత్ అంబరీష్, డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్ పలువురు అధికారులు పాల్గొన్నారు.

పటిష్ట బందోబస్తు

ఏలూరు క్రైం: మద్యంషాపుల లాటరీ ప్రక్రియలో పోలీసులు ముందస్తు చర్యలను చేపట్టారు. డీఎస్పీ శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో చలసాని గార్డెన్స్ వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. మినీబైపాస్ రోడ్డులో ఇరువైపులా వాహనాల రాకపోకలను నిలిచివేశారు. దరఖాస్తు చేసిన వారికి సంబంధించిన వారిని మాత్రమే అనుమతించారు. ముందస్తుగా 15 వేల మంది వరకూ వస్తారని అంచనా వేసి ఆ దిశగా పార్కింగ్‌కు ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకున్నారు. ఎస్పీ స్వయంగా ఆ ప్రాంతాన్ని పరిశీలించి పోలీసు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

పట్టభద్రులు ఓటు నమోదు చేయించుకోవాలి


పట్టభద్రుల ఓటు నమోదుపై మాట్లాడుతున్న ఎమ్మెల్యే చిర్రి బాలరాజు

కొయ్యలగూడెం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): పట్టభద్రులంతా ఓటు కలిగి ఉండాలని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు, ఎమ్మెల్సీ వి.చిరంజీవి కోరారు. పట్టభద్రుల ఓటు నమోదుపై క్లస్టర్ ఇన్‌చార్జిలకు సోమవారం అవగాహన కల్పించారు. పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ అభ్యర్థిని కూటమి ప్రభుత్వం కైవసం చేసుకోవాలని కోరారు. కూటమి నాయకులు, కార్యకర్తలు అంకితభావంతో పని చేయాలని కోరారు. పట్టభద్రులైన ప్రతీ ఒక్కరు ఓటు నమోదు చేయించుకోవాలని, ఓటు నమోదు చేయించే విధంగా నాయకులు అవగాహన కల్పించాలన్నారు. కూటమి తరపున పేరాబత్తుల రాజశేఖర్‌ను గెలిపించుకోవాలని కోరారు. కార్యక్రమంలో పారేపల్లి రామారావు, బొల్లిన నిర్మాల కిషోర్, శీలం వెంకటేశ్వరరావు, చింతల వెంకటరమణ, ఏపూరి సతీష్, కసుకుర్తి ఉమా, తాడికుంట మురళీ, తదితరులు పాల్గొన్నారు.

● జంగారెడ్డిగూడెం: మండలంలోని పట్టభద్రులకు నవంబరు 6 లోపు ఓటు నమోదు చేయించాలని ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ టీడీపీ నాయకులకు సూచించారు. మండలం, పట్టణంలోని టీడీపీ క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జిలతో ఎమ్మెల్యే సమావేశం నిర్వహించారు. ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పేరాబత్తుల రాజశేఖరం టీడీపీ తరుపున పోటీ చేస్తున్నారని తెలిపారు. పార్టీ నాయకులు ఆయన విజయానికి కృషి చేయాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీ రామకృష్ణ, దాసరి శ్యాం చంద్రశేషు, రావూరి కృష్ణ, సాయిల సత్యనారాయణ, పెనుమర్తి రామకుమార్, షేక్ ముస్తఫా, బొబ్బర రాజ్‌పాల్ కుమార్, నంబూరి రామచంద్ర రాజు, ఈఎస్‌సీహెచ్.శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఓటుపై విద్యార్థులకు అవగాహన

పోలవరం: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థులకు ఓటు హక్కు నమోదు ఆవశ్యకతపై అధికారులు అవగాహన కల్పించారు. 18 ఏళ్లు నిండిన వారంతా ఓటు నమోదు చేసుకోవాలని తహసీల్దారు సాయిరాజు సూచించారు. వీఆర్వో ప్రసాద్, గాంధీ కళాశాల ప్రిన్సిపాల్ సజిని, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

జోరు వాన

● ఉదయం నుంచి ఎండ.. సాయంత్రం వర్షం ● రైతుల ఆందోళన

పెదపాడు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పలుచోట్ల సోమవారం అకస్మాత్తుగా జోరు వానతో గ్రామాలు తడిసిముద్దయ్యాయి. మధ్యాహ్నం వరకు ఎండతో కూడిన వాతావరణం కాస్త వర్షంతో పల్లపు ప్రాంతాల్లో నీరు చేరింది. డ్రెయిన్లలో నీరు పలుచోట్ల రోడ్లపైకి ప్రవహించింది. సుదూర ప్రాంతాలకు వెళ్లిన వాహనదారులు తడిసిముద్దయ్యారు.

● పెదవేగి: మండలంలో జడివాన కురిసింది. వాతావరణం ఒక్కసారిగా మారి, జడివాన పడింది. ఇంటిదారిలో ఉన్న ఉద్యోగులు, ప్రజలు జడివానలో తడిసి ముద్దయ్యారు. సాయంత్రం ఐదుగంటలనుంచ ఏడు గంటల వరకు వర్షం వస్తూ, పోతూ ప్రజలను అవస్థల పాల్జేసింది.

● పోలవరం: అల్పపీడన ప్రభావంతో మండలంలో సోమవారం ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. సబ్ స్టేషన్ వద్ద సాంకేతిక సమస్య తలెత్తడంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగింది. పోలవరం మెయిన్‌బజార్‌లో వర్షపునీరు నిలిచి ప్రజానీకం రాకపోకలు అంతరాయం కలిగింది.



పెదవేగి మండలంలో జోరున కురుస్తున్న వర్షం, ద్వారకాతిరుమలలో అలుముకున్న మేఘాలు

రైతుల్లో ఆందోళన

జీలుగుమిల్లి: మండలంలో వర్షంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. బర్రింకలపాడు, జీలుగుమిల్లి, తాటియాకులగూడెం ప్రాంతాల్లో వర్షం కురిసింది. వరి చేలు ఈనిక, గింజ దశలో మరికొన్ని వరిచేలు ఉన్నాయి. పొగాకు నాట్లు వేస్తున్నారు.

కారుమబ్బులు కమ్మిన వేళ..

ద్వారకాతిరుమల: వాతావరణం ఒక్కసారి మబ్బులు కమ్ముకున్నాయి. ఆలయ ప్రధాన రాజగోపురం వెనుక కారుమబ్బులు కమ్మి తరువాత అవి అంతటా అలముకున్నాయి.

ఆంధ్రజ్యోతి
నూజివీడు
మంగళవారం 15 అక్టోబరు 2024

చారిత్రక వైభవం

వెయ్యేళ్ల గాలి గోపురం



అలనాటి ప్రాచీన సంస్కృతీ, సంప్రదాయాలకు నిలయాలు మన ఆలయాలు. ఆలయాల్లోని ప్రతీ గాలి గోపురానికి ఓ ప్రాముఖ్యత ఉంటుంది. అపురూపమైన చిత్రకళకు, శిల్ప కళా సంపదకు అవి ఆనవాళ్లు. ఏలూరులోని శనివారపుపేట చెన్నకేశవస్వామి ఆలయంలోని గాలి గోపురం వెయ్యేళ్ల చరిత్ర కలిగినది. ఇది చాళుక్యుల కాలం నాటి వైభవానికి ప్రతీకగా నిలుస్తోంది. వంద అడుగుల ఎత్తులో నాలుగు అంతస్తులుగా ఉంటూ విశేష శిల్ప కళా సంపదతో చూపరులకు కనువిందు చేస్తోంది. 11వ శతాబ్దంలో దీని నిర్మాణం జరిగింది. చాళుక్యుల కాలంలో జరిగినట్లు పురావస్తు శాఖ నిర్ధారించింది. గోపురంపై ఆనాటి చాళుక్య రాజుల సంస్కృతీ, సంప్రదాయాలతోపాటు రామాయణం, శ్రీరామపట్టాభిషేకం, మహాభారతం, భాగవతం వంటి పురాణ ఇతిహాసాలు, క్షీరసాగర మథనం, యక్షులు, గంధర్వులు, కిన్నెరలు, కింపురుషులు, ఆళ్వార్లు, రుషులు, మునులు, వాత్సాయన కామసూత్రకు సంబంధించిన శిల్పాలను శాస్త్రీయ విధానంలో ప్రాచీన వైభవానికి సంకేతంగా నిర్మించారు. పూర్తిగా ఇసుక, రాతి శిలతో నిర్మితమైన ఈ గాలి గోపురం కొన్నేళ్ళ క్రితం శిథిలావస్థకు చేరుకుంది. 2004లో గోపురం మీద ఉన్న శిలా సంపదను తొలగించి పునర్ నిర్మించారు. చాళుక్యుల రాజుల కాలంలో గోపురం నిర్మితమైనప్పటికి తరువాత కాలంలో అప్పటి జమీందార్లు మేకా ధర్మఅప్పారావు ఆలయానికి పోషకులుగా ఉన్నట్లు ఇక్కడ శాసనాల ద్వారా తెలుస్తోంది. ద్వారకాతిరుమల దత్తత ఆలయంగా ఉన్న ఈ ఆలయం ప్రస్తుతం దేవదాయ శాఖ పరిధిలో ఉంది. ఈ ఆలయంలో విష్ణుమూర్తి, చెన్నకేశవుడిగా, వేంకటేశ్వరుడిగా రెండు రూపాల్లో కొలువై ఉన్నాడు.

- ఏలూరు రూరల్ /ఆంధ్రజ్యోతి

క్రైమ్ కార్నర్

మందలించారని మనస్థాపంతో ఆత్మహత్య

భీమడోలు, అక్టోబరు 14 : మద్యానికి బానిసై కుటుంబ సభ్యులతో గొడవపడి గడ్డిమందు తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. భీమడోలు మండలం గుండుగొలను గ్రామానికి చెందిన బోడా కుమార్‌రాజా (45) కూలి పనులు చేస్తూ జీవిస్తుంటాడు. తనకు వివాహం కాగా. కుమా రులు ఇద్దరు ఉన్నారు. అయితే రోజూ మద్యం సేవించి కుటుంబ సభ్యులతో గొడవపడుతుంటాడు. ఈ నేపథ్యంలో 13వ తేదీ మద్యం సేవించి ఇంట్లో కుటుంబ సభ్యులతో గొడవ పడ్డాడు. కుటుంబ సభ్యులు అతనిని మందలించడంతో మనస్థాపానికి గురై స్థానిక అంబేద్కర్ విగ్రహం సమీపంలో గడ్డిమందు తాగి అపస్మారక స్థితికి వెళ్ళాడు. అతని సోదరుడు రాజేంద్ర కుమార్ ఇంట్లో వారికి ఫోన్‌చేసి ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా సోమవారం ఉదయం 5 గంటల సమయంలో మృతి చెందాడు. మృతుడి కుమారుడు అర్జున్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు భీమడోలు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బైక్ కొనలేదని యువకుడు..

టి.నరసాపురం: కలుపుమందు తాగి యువకుడు పిన్నిబోయిన పృథ్వి (23)మృతి చెందాడు. తెడ్లం గ్రామానికి చెందిన సుబ్బారావు రెండో కుమారుడు పృథ్వి రెండేళ్లుగా స్థానిక పురుగులమందు షాపులో పని చేస్తున్నాడు. రెండు నెలలుగా తండ్రిని స్పోర్ట్స్ బైక్ కొనమని అడుగుతుండగా అప్పులు తీరాక కొంటానని చెబు తుండటంతో మనస్థాపానికి గురైన యువకుడు ఈనెల 12న రాత్రి కలుపు మందు తాగి ఆత్మ హత్యకు పాల్పడ్డాడు. అతనిని చింతలపూడి ఆసుపత్రికి తరలించగా అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం ఏలూరు తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ జయరాజు తెలిపారు.

మనస్థాపంతో వృద్ధురాలు..

భీమవరం క్రైం, అక్టోబరు 14 : ఒకపక్క అనా రోగ్యం, మరోపక్క కుమార్తెకు, కుమారుడికి వివాహం కావట్లేదనే మనస్తాపంతో వృద్ధురాలు చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. భీమవరం వన్‌టౌన్ హెచ్‌సీ చక్రవర్తి తెలిపిన వివరాలు ప్రకారం గునుపూడికి చెందిన కోన సీతామహాలక్ష్మీ (62) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. దానికి తోడు ఇద్దరు పిల్లలకు వివాహం కావట్లేదనే బెంగ కూడా ఉంది. కుమారుడు మురళీకృష్ణ సోమవారం ఉదయం లేచేసరికి తల్లి కనిపించలేదు. చుట్టుపక్కల వెతుకుతుండగా అటుగా వెళుతున్న వ్యక్తి ఎవరో మహిళ మృత దేహం సోమగుండం చెరువులో తేలుతుందని చెప్పడంతో వెళ్ళి చూడగా తన తల్లి మృత దేహంగా గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ చక్రవర్తి తెలిపారు.

బాలిక అదృశ్యం

ముసునూరు, అక్టోబరు 14: బాలిక అదృశ్యంపై ముసునూరు ఎస్‌ఐ చిరంజీవి ఆదివారం రాత్రి కేసు నమోదు చేశారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని రమణక్కపేట ఎస్సీ కాలనీకి చెందిన బాలిక నూజివీడులో ఇంటర్ చదువుతోంది. అయితే ఈ నెల 12 నుంచి బాలిక కనిపించడం లేదని తల్లిదండ్రులు ఫిర్యాదు ఇచ్చినట్లు ఎస్సై తెలిపారు. ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన చెప్పారు.

వేగం వల్లే ప్రమాదం

» ఆర్టీసీ బస్సు బోల్తా » ఒకరి మృతి.. 17 మందికి గాయాలు



చింతలపూడి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు జిల్లా చింతలపూడి మండలం డి.ఎన్ రావుపేట సమీపంలో హైదరాబాదు నుండి చింతలపూడి మీదుగా ఏలూరు వెళ్ళే సూపర్ లగ్జరీ ఏలూరు డిపోకు చెందిన ఆర్టీసి బస్సు అదుపు తప్పి సోమవారం తెల్లవారు జామున బోల్తా పడింది. బస్సులో 36 మంది ప్రయాణిస్తున్నారు. ఇందులో ఏలూరుకు చెందిన పెందుర్తి విమలాబాయి (74) మృతి చెందగా మరో 17 మందికి గాయాలయ్యాయి. క్షతగాత్రు లను చింతలపూడి ఏరియా ఆసుపత్రికి తర లించారు. స్వల్పగాయాలైన 13 మందికి చికిత్స చేశారు. కాగిత స్వరూప, పెందుర్తి సియోను, కుమారి, ఎం.రిషిత, గాలంకి శిరీషలకు తీవ్ర గాయాలు కావడంతో చికిత్స జరిపి ఏలూరు తరలించారు. మరో పది నిమిషాల్లో బస్సు చింత లపూడి సెంటర్‌కు చేరుతుందనగా డి.ఎన్. రావుపేట దాటిన తరువాత మలుపు తిరుగుతూ వేగంగా బస్సు అదుపు తప్పడంతో బోల్తా పడి కొంత దూరం దూసుకుపోయింది. ఈ మార్గం లోనే వెనుక వస్తున్న ఆర్టీసి బస్సు ప్రమాదాన్ని చూసి బోల్తా పడిన బస్సు వెనుకవైపు అద్దాలు పగులకొట్టి క్షతగాత్రులు కొందరిని ఎక్కించుకుని మరికొందరిని ఆటోల్లో ఏరియా ఆసుపత్రికి తరలించారు. జీడిమెట్ల నుంచి ఈ సర్వీసు ఖమ్మం, సీతానగరం, చింతలపూడి మీదుగా ఏలూరు వెళ్ళాల్సి ఉంది. అయితే ఈ మార్గంలో రోడ్లు బాగోలేకపోవడంతో గత కొన్ని రోజులుగా సత్తుపల్లి, గురుభట్లగూడెం మీదుగా చింత లపూడి రాకపోకలు సాగిస్తున్నాయి. బస్సు మలు పులో ఎడమవైపుకు అదుపు తప్పి బోల్తా పడి కొద్ది దూరం ఈడ్చుకుపోయిందని ప్రయాణి కులు చెబుతున్నారు.

పది నిమిషాల్లో గమ్యం..

బస్సు బోల్తా ప్రమాదంలో గాయపడిన వారిలో నలుగురు ఒకే కుటుంబానికి చెందిన వారు.దసరా సెలవులు కావడంతో నాలుగురోజుల క్రితం పెందుర్తి విమలాబాయి, ఆమె ముగ్గురు కుమార్తెలు, ఇద్దరు పిల్లలు హైదరా బాదులో బంధువుల ఇళ్ళకు వెళ్ళారు. సెలవులు పూర్తికావడంతో తిరిగి వస్తూ ఈ ప్రమాదానికి గురయ్యారు. ఇందులో మృతురాలి కూతురైన స్వర్ణలత చింతలపూడి ప్రభుత్వ జూని యర్ కళాశాల విద్యార్థినుల సంక్షేమ హాస్టల్ వార్డెన్‌గా పనిచేస్తున్నారు. వీరంతా ఒకే బస్సు ఎక్కారు. స్వర్ణలత చింతలపూడిలో దిగిపోతుంది, తామంతా ఏలూరుకు చేరుకోవచ్చని బస్సులో ప్రయాణించారు. పది నిమిషాల్లో చింతలపూడి వస్తుందనగా ముగ్గురు కుమార్తెలు లగేజీలు తీసుకోవడానికి సిద్ధమవుతుండగా ప్రమాదం జరిగి విషాదాన్ని నింపింది.

ఏలూరు-చింతలపూడి మీదుగా..

హైదరాబాదుకు ఆరు ఆర్టీసీ సర్వీసులు, రెండు ప్రైవేటు స్లీపర్ సర్వీసులు నడుస్తున్నాయి. 25 సంవత్సరాల్లో ఎన్నడూ ఇటువంటి ప్రమాదం ఈ ప్రాంతంలో హైదరాబాదు వెళ్ళే సర్వీసులో తాము చూడలేదని స్థానికులు చెబుతున్నారు. ఏలూరు నుంచి చింతలపూడి మీదుగా వెళ్లే బస్సులు కూడా గ్రామీణ ప్రాంతా లను టచ్ చేసుకుంటూ చింతలపూడి చేరుకుని వెళ్తుంటాయి. దీంతో నేరుగా ఆయా గ్రామాల్లో ప్రయాణికులు దిగుతుంటారు. ఈ ప్రమాదం చూసి పలువురు ఉలిక్కిపడ్డారు. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రవీంద్ర మాట్లాడుతూ బస్సువేగంగా వెళ్తూ మలుపు తిరిగిన సమయంలో అదుపు తప్పడంతో ప్రమాదానికి గురైందని చెప్పారు. డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నామని, మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించామని చెప్పారు. చింతలపూడి ఎమ్మెల్యేసొంగా రోషన్‌కుమార్ ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించారు.

నేడు జీవో 117పై విస్తృత స్థాయి సమావేశం

ముదినేపల్లి, అక్టోబరు 14 : విద్యాశాఖలో వైసీపీ ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన జీవో నంబర్ 117 ఫలితంగా ప్రాథమిక, యూపీ పాఠశాలల్లో నెలకొన్న ప్రతికూల పరిస్థితులు, విద్యాబోధనను మెరుగుపర్చేందుకు అమలు చేయాల్సిన ప్రత్యామ్నాయ విధానాలపై చర్చించేందుకు మంగళవారం ప్రభుత్వ స్థాయిలో విస్తృత సమావేశం జరుగనున్నట్లు ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి బేతాళ రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఆదేశాలతో ఆ శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి కోన శశిధర్, కమిషనర్ విజయరామరాజు నిర్వహించనున్న ఈ సమావేశంలో రాష్ట్రంలో గుర్తింపు పొందిన టీచర్ల సంఘాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు పాల్గొంటారని తెలిపారు. సమావేశం మంగళగిరిలోని విద్యాభవన్‌లో జరుగుతుందన్నారు. జీవో నంబర్ 117 వల్ల పాఠశాలల విలీనం, ఉపాధ్యాయ పోస్టుల రద్దు, యూపీ పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్లు లేకపోవటం లాంటి అంశాలపై సమావేశంలో చర్చించి ఈ జీవో వల్ల ప్రాథమిక విద్యకు కలిగిన నష్ట నివారణకు చర్యలు చేపట్టనున్నట్లు రాజేంద్ర ప్రసాద్ తెలిపారు.



కైకలూరులో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కామినేని



కాళ్లపాలెంలో సీసీ రోడ్డుకు సర్పంచ్ స్వర్ణకుమారి శంకుస్థాపన



దాకరంలో రోడ్డు నిర్మాణానికి సర్పంచ్ రాజా శంకుస్థాపన

పల్లెలకు పండగే

» అయిదేళ్లలో అన్ని గ్రామాల్లోనూ సిమెంటు రహదారులు

» పల్లె పండుగలో ఎమ్మెల్యే కామినేని » పలు చోట్ల శంకుస్థాపనలు

కైకలూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో మట్టిరోడ్లు లేకుండా చేస్తామని ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. సోమవారం కైకలూరు కేడీసీసీ బ్యాంకు నుంచి ఎన్జీవోస్ కాలనీలోకి వెళ్లే రహదారికి, మండలంలోని తామరకొల్లులో పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా సీసీ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఐదేళ్లలో అన్ని గ్రామాల్లోనూ నూరుశాతం సీసీ రోడ్లు నిర్మిస్తామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 13326 పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించడం దేశంలోనే మొట్టమొదటిసారిగా ఏపీలో జరిగిందని, పంచాయతీ తీర్మానాలు చేసిన పనులకు సాంకేతిక ఆమోదం సైతం లభించాయన్నారు. పంచాయతీల్లో జరిగే పనులపై డిస్‌ప్లే బోర్డులు ఏర్పాటుచేసి ప్రజలందరికీ తెలిసేలా చూస్తామన్నారు. సర్పంచ్‌లు డీఎం నవరత్నకుమారి, భట్రాజు శివాజీ, జడ్పీటీసీ సభ్యురాలు కురేళ్ళ బేబి, ఎంపీటీసీ గంగుల వెంకటనరసమ్మ, కూటమి నాయకులు పెన్మెత్స త్రినాథరాజు, నర్సిపల్లి అప్పారావు, పూల రామచంద్రరావు, పోలవరపు లక్ష్మీరాణి, పేరిచర్ల ప్రసాదరాజు, కొల్లి వరప్రసాద్, గంగుల శ్రీదేవి, నున్న వనితాజ్యోతి పాల్గొన్నారు.

మండవల్లి: గ్రామాల్లో చేపట్టే అభివృద్ధి కార్యక్రమాల్లో రాజకీయాలకతీతంగా అందరూ సమష్టిగా పనిచేయాలని కామినేని కోరారు. సోమవారం భైరవపట్నం, లింగాల, కానుకొల్లు గ్రామాల్లో నరేగా నిధుల ద్వారా మంజూరైన సీసీ రోడ్లకు శంకుస్థాపన చేశారు. అనంతరం రాయిగిరి ఆంజనేయులు, సావిత్రి జ్ఞాపకార్థం వారి కుమారుడు రాయిగిరి రాము ఆర్థిక సాయంతో ఏర్పాటుచేసిన బస్టాండ్‌ను కామినేని ప్రారంభించారు. కైకలూరు నియోజకవర్గ ఎన్డీయే నాయకుల చాపరాల దుర్గాప్రసాద్, ముళ్లపూడి సత్తిబాబు, బోయిడి సురేష్, మండవల్లి ఎంపీపీ పెద్దిరెడ్డి శ్రీరామ్ దుర్గాప్రసాద్, జడ్పీటీసీ ముంగర విజయ నిర్మల మల్లికార్జున్, మండల టీడీపీ అధ్యక్షుడు నారగాని నాగేశ్వరరావు, గాదిరాజు భాస్కరరాజు తదితరులు పాల్గొన్నారు.

కలిదిండి: మండలంలోని గోపాలపురం, కాళ్లపాలెం గ్రామాల్లో పల్లె పండుగ వారోత్సవాలను ప్రారంభించారు. కాళ్లపాలెంలో రూ.20.2 లక్షలతో నిర్మించే సీసీ రోడ్డుకు సర్పంచ్ స్వర్ణకుమారి, కూటమి నాయకులతో కలసి శంకుస్థాపన చేశారు. గోపాలపురంలో రూ.7.2 లక్షలతో నిర్మించే సీసీ రోడ్డుకు సర్పంచ్ అనపర్తి వడ్డి కాసులు, మాజీ సర్పంచ్ కోటేశ్వరరావు శంకుస్థాపన చేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు పోకల జోగిరాజు, ప్రధాన కార్యదర్శి మేడిశెట్టి సీతారామాంజ నేయులు, పంచాయతీ రాజ్ ఏఈఈ బి.శ్రీనివా స్, ఉపాధి ఏపీవో ఆనంద్ పాల్గొన్నారు.

ముదినేపల్లి: మండలంలో సుమారు రూ.4.49 కోట్లతో చేపట్టనున్న రహదారుల నిర్మాణాలకు శంకుస్థాపనలు ప్రారంభమయ్యాయి. సోమవారం దాకరం, పేరూరు గ్రామాల్లో సుమారు రూ.6 లక్షల వ్యయంతో చేపట్టిన రెండు రోడ్ల నిర్మాణ పనులకు ఆయా గ్రామాల సర్పంచ్‌లు జాస్తి రాఘవేంద్రరావు (రాజా), పుట్టి మాధవీరాణి శంకుస్థాపన చేశారు. దాకరం ఉప సర్పంచ్ సురేష్, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి ఎల్.శివ నాగేశ్వరరావు, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ రేణుకా రావు, టీడీపీ నాయకుడు పుట్టి లక్ష్మణస్వామి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి అధికారులు సహకరించండి

మండవల్లి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లోని సమస్యలు పరిష్కారానికి అధికారులు సహకరించాలని మండవల్లి ఎంపీపీ పెద్దిరెడ్డి శ్రీరామ్‌దుర్గాప్రసాద్ కోరారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధికారులు అంకితభావంతో పనిచేసి గ్రామ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. వైస్ ఎంపీపీ విష్ణు, వివిధ శాఖ అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు

మండవల్లి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మండవల్లి ఎన్‌హెచ్ రోడ్డు వెంబడి ఆక్రమణల తొలగింపునకు పంచాయతీ సోమవారం శ్రీకారం చుట్టింది. సర్పంచ్ మెండా ఝాన్సీ, సెక్రటరీ కొండలు ఆధ్వర్యంలో ఎన్‌హెచ్ రోడ్డు మార్గంలో ఆక్రమంగా ఏర్పాటుచేసిన వివిధ షెడ్లు, పాకలను తొలగించారు. ఆక్రమణలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

గొంతేనమ్మ ఊరేగింపు

ముసునూరు, అక్టోబరు 14: వేల్పుచర్ల పడమట ఎస్సీ కాలనీలో గొంతేనమ్మ ఊరేగింపును సోమవారం వైభవంగా నిర్వహించారు. సంప్రదాయం ప్రకారం అమ్మవారికి 11 రోజులపాటు పూజలు చేసి, కోలాటాలు, జానపద గేయాలతో ఊరేగించి సాగనంపారు. ప్రతి ఏటా అమ్మవారికి పూజలు చేస్తే పాడిపంటలతో గ్రామం సుభిక్షంగా ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. టీడీపీ యువనేత గరికిముక్కు నాని, పాటల రచయిత రాంబాబు గోసాల, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



ఆగిరిపల్లి విద్యార్థినుల ప్రతిభ

ఆగిరిపల్లి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర-2047లో భాగంగా జిల్లా స్థాయిలో నిర్వహించిన వక్తృత్వ పోటీల్లో ఎల్. మున్ని, వ్యాసరచన పోటీల్లో హేమనాగ త్రివేణి మూడవ స్థానాన్ని సాధించడంతో సోమవారం వీరిని హెచ్‌ఎం పుష్పలత అభినందించారు.



డాక్టర్ సూరి భగవంతం విగ్రహావిష్కరణ అనంతరం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి పార్థసారథి తదితరులు (ఇన్‌సెట్) ఆవిష్కరించిన సూరి భగవంతం కాంస్య విగ్రహం

సూరి భగవంతం స్మారక కేంద్రం ఏర్పాటు చేస్తా: మంత్రి

ఆగిరిపల్లి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి):భారత రక్షణ క్షిపణి రంగానికి ప్రపంచస్థాయి గుర్తింపు తెచ్చిన మహనీయుడు డాక్టర్‌సూరి భగవంతం అని, ఆయన మన ప్రాంతం వారు కావడం మనకెంతో గర్వకారణమని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖామంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. డీఆర్‌డీవో పూర్వ డైరెక్టర్ జనరల్ డాక్టర్ సూరి భగవంతం 115వ జయంతి సందర్భంగా ఆయన కాంస్య విగ్రహాన్ని సోమవారం ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, డీఆర్డీవో పూర్వ ఛైర్మన్ డా.జి. సతీష్‌రెడ్డితో కలిసి మంత్రి పార్థసారథి శ్రీ శోభనాద్రి లక్ష్మీ నరసింహ వేదశాస్త్ర పాఠశాల ఆవరణలో ఆవిష్కరించారు. అలాగే సూరిభగవంతంపై రచించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి మాట్లాడుతూ నూజివీడులో డా.సూరి భగవంతం స్మారక కేంద్రాన్ని ఏర్పాటు చేస్తానని, వేద పాఠశాల అభివృద్ధికి సహకారం అందిస్తానని మంత్రి హామీ ఇచ్చారు. డా.సూరి భగవంతం ఫౌండేషన్ ఫౌండర్ డైరెక్టర్ ఎస్.బి. రామ్, నేషనల్ బుక్‌ట్రస్ట్ సభ్యులు జి.వల్లీశ్వర్, నూజివీడు ఆర్డీవో వాణి, పంచాయతీరాజ్ ఈఈ బాపిరెడ్డి, వేద పాఠశాల కార్యవర్గ సభ్యులు సూరిశర్మ, సలాక రఘునాథ శర్మ, దోర్బల ప్రభాకర శర్మ తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహాన్ని తనిఖీ చేసిన న్యాయాధికారి



వసతి గృహంలో రికార్డులను పరిశీలిస్తున్న న్యాయసేవాధికారి లక్ష్మి

కైకలూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): హాస్టల్ విద్యార్థులకు ప్రభుత్వం నుంచి వస్తున్న అన్ని వసతులను అందించాలని కైకలూరు సీనియర్ న్యాయసేవాధికారిణి వీవీఎన్‌వి లక్ష్మి అన్నారు. సోమవారం కైకలూరు కళాశాలల బీసీ బాలికల వసతిగృహాన్ని ఆకస్మిక తనిఖీ చేసి విద్యార్థినులకు అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా విద్యార్థినుల సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం మెనూను అమలుచేయాలని నాణ్యమైన భోజనాన్ని అందించాలని, మరుగుదొడ్లు ఎప్పటికప్పుడు శుభ్రపర్చాలని ఆదేశించారు. న్యాయవాదులు పి. పవన్‌కాంత్, ప్రసన్నకుమార్, వార్డెన్ ఎన్. రాధా తదితరులు పాల్గొన్నారు.

పవన్‌ను కలసిన బీసీ నాయకుడు బీకేఎం నాని



కైకలూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌ను కైకలూరు బీసీ నాయకుడు బీకేఎం నాని మర్యాద పూర్వకంగా కలిశారు. సోమవారం పెనమ లూరు నియోజకవర్గంలో జరిగిన పల్లెపండుగ కార్యక్రమంలో ఆయనకు పుష్పగుచ్ఛాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఎంపీ వల్లభనేని బాలశౌరి తదితరులు పాల్గొన్నారు.

విజిలెన్స్ దాడులు

ఆగిరిపల్లి, అక్టోబరు 14: మండలంలోని అడవి నెక్కలం సెక్షన్లో విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో విజిలెన్స్ దాడులు జరిగాయి. సుమారు ఐదు లక్షల 30 వేల రూపాయలు జరిమానా విధించారు. విజిలెన్స్ అధికారులు అధికారులు 40 బృందాలుగా ఏర్పడి 2842 గృహ సర్వీసులు, 171 వాణిజ్య సముదాయాలు సర్వీసులను తనిఖీ చేశారు. ఎక్కడైనా విద్యుత్ చౌర్యం జరిగితే ఫోన్ నంబర్లు 9440812362, 9440812363కు సమాచారం ఇవ్వాలని కోరారు. తనిఖీల్లో నూజివీడు రూరల్ ఏఈ రామారావు, నూజివీడు డివిజన్ పరిధిలోని ఏఈలు, లైన్ ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు పల్లె పండుగకు మంత్రి

ముసునూరు, అక్టోబరు 14: పల్లె పండుగ - పంచాయతీ వారోత్సవాల్లో భాగంగా మండలంలోని పలు గ్రామాల్లో చేపట్టబోయే అభివృద్ధి పనుల శంకుస్థాపనకు మంగళవారం రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారథి ముఖ్య అతిథిగా విచ్చేస్తున్నట్లు ఎంపీడీవో జి.రాణి తెలిపారు. అక్కిరెడ్డిగూడెంలో ఉదయం 9 గంటలకు, సూరేపల్లిలో 11, లోపూడిలో మధ్యాహ్నం 2, చెక్కపల్లిలో 3గంటలకు మంత్రి చేతుల మీదుగా సీసీ రహదారుల నిర్మాణానికి శంకుస్థాపనలు జరుగుతాయన్నారు. అనంతరం చెక్కపల్లిలో ప్రజావేదిక జరుగుతుందని, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొనాలని కోరారు.

రేపటి నుంచి పాఠశాలల తనిఖీ

ముదినేపల్లి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఈ నెల 16 నుంచి 30 వరకు వార్షిక తనిఖీలను నిర్వహించనున్నట్లు ఎంఈవో కె.నరేష్ కుమార్ తెలిపారు. ఈ నెల 16న ముదినేపల్లి గౌతం ఇంగ్లీష్ మీడియం హైస్కూలు, 19న ముదినేపల్లి ఈస్ట్ ఎలిమెంటరీ, 26న చినకామనపూడి యూపీ పాఠశాల, 28న సింగరాయపాలెం యూపీ పాఠశాల, 30న కాకరవాడ యూపీ పాఠశాలల్లో రికార్డులు, పాఠ్యాంశాల బోధనా ప్రణాళిక తదితర అంశాలను తనిఖీ చేస్తామన్నారు.

చంద్రమౌళీశ్వరుడి శాంతి కల్యాణం

ఆగిరిపల్లి, అక్టోబరు 14: మండలంలోని కనసానపల్లిలో ఆదివారం శ్రీ బాలా త్రిపురసుందరి సమేత చంద్రమౌళీశ్వర స్వామి శాంతి కల్యాణం అనంతరం స్వామివారికి గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు విశేషంగా పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించినట్లు ప్రధాన అర్చకులు దేవులపల్లి సాయి స్వరూప్ తెలిపారు.

కొత్త వాళ్లకే కిక్

(ఐదో పేజీ తరువాయి)

చుక్కెదురైంది. జంగారెడ్డిగూడెం కేంద్రంగా ఏర్పడిన సిండికేట్‌లు పెద్ద సంఖ్యలో దుకాణాల కోసం దరఖాస్తు చేశాయి. భీమవరం, అరకు వంటి ప్రాంతాల్లో కూడా దుకాణాల కోసం ఈ సిండికేట్‌లలో ఉన్న కొందరు పోటీగా దరఖాస్తులు పంపారు. కాని లాటరీలో వీరు ఆశించినట్టుగా దుకాణాలు దక్కక పోవడంతో ఈ సిండికేట్‌లన్నీ కోట్ల రూపాయలు నష్టపోయాయి. సిండికేట్‌లలో పెట్టుబడి పెట్టినవారంతా మధ్యాహ్నం నాటికే తగినన్ని దుకాణాలు లభించక బావురమన్నారు. దెందులూరు నియోజకవర్గంలోను నువ్వానేనా అన్నట్టుగా మద్యం దుకాణాలకు దరఖాస్తు చేసుకున్నా అదృష్టం కొందరికే వరించింది. మద్యం దుకాణాలపై ఎంతో పెట్టుబడి పెట్టి రంగంలోకి దిగిన వారికి నిరాశే మిగిలింది.

కొత్త ముఖాలకే లక్కు

మద్యం వ్యాపారంలో ఈసారి కొత్త ముఖాలకే లక్కు వరించింది. ఈ వ్యాపారంలో రూపాయికి రూపాయి మిగులుతుందన్న ఆశతో పెద్ద ఎత్తున దుకాణాలకు దరఖాస్తు చేసుకున్నారు. ఒకవైపు సిట్టింగ్ ఎమ్మెల్యేల భయం ఉన్నా.. సిండికేట్‌ల అదురున్నా ఖాతర్ చేయకుండా కులాలకతీతంగా దరఖాస్తులు చేశారు. పెద్ద విచిత్రం ఏంటంటే అసలు మద్యం వ్యాపారమంటేనే చీదరించుకునే కుటుంబాలకు చెందిన వారు కూడా ఈసారి దుకాణాల కోసం దరఖాస్తు చేయడం అనూహ్యంగా వారే లాటరీ కొట్టడం అందరినీ ముక్కున వేలేసుకునేలా చేసింది. అంతకంటే మించి కొత్తోడైనా అదృష్టవంతులురా.. అంటూ మిగతావారంతా కాస్తంత అసూయతోనే వ్యాఖ్యలు చేశారు. మొత్తం 144 దుకాణాల్లో కొత్త ముఖాలకే చోటు దక్కడం మద్యం విధానంలో సరికొత్త అనుభవం. వీరంతా కొత్త ముఖాల్లో ఎక్కడికక్కడ సోమవారంనాడే మిగతా వారితో కలుపుకుని వ్యాపారం చేయడానికి వాటాలకు కొన్ని సెంటర్లలో తెరలేపారు. ఎవరికైతే దుకాణం లభిస్తుందో వారితో ఇంకొందరు క్షణాల్లో సంప్రదింపులు జరిపారు. తమకు ఇంత వాటా ఇస్తే అప్పటికప్పుడు ముందస్తు సొమ్ము చెల్లించడానికి సిద్ధపడ్డారు. మద్యం దుకాణాల లాటరీ జరుగుతున్న ప్రాంతంలో కార్లలోనే లక్షలాది రూపాయలు ఉండడంతో అనేకమంది ఆ కార్లకు గస్తీ కాశారు. కార్లు విడిచి వెళ్ళకూడదంటూ డ్రైవర్లందరినీ కట్టడి చేయడం కనిపించింది.

చేతిలో డబ్బు పోయెనె..

మద్యం దుకాణం కోసం అర్రులుచాచి అనేకమంది కోట్లాది రూపాయలు చేజార్చుకున్నారు. పోటాపోటీగా దుకాణాలు సొంతం చేసుకోవడానికి సిండికేట్‌లుగా, వ్యక్తిగతంగా రంగంలోకి దిగి ఏదోక రూపంలో దుకాణం సొంతమైతే చాలని తెగ రెచ్చిపోయారు. లాటరీలో 30-40 దుకాణాలకు దరఖాస్తు చేసుకుని ఉంటే కనీసం ఏడు, ఎనిమిది దుకాణాలు సొంతంకావడం ఖాయమనే ధీమాతో రంగంలోకి దిగిన వారికి ఎక్సైజ్ లాటరీ షాక్ ఇచ్చింది. అదృష్టం ముఖం చాటేసింది. ఈ వ్యాపారంతో సంబంధం లేకపోయినా కొందరు వ్యాపారులు, ఉద్యోగులు, ఆఖరుకు ప్రైవేటు సంస్థల్లో పని చేస్తున్న వారు సైతం తాము కూడబెట్టిన దానిలో రెండు లక్షలు చొప్పున సిండికేట్‌లకు అందజేశారు. వస్తే రెండేళ్ళ పొడవునా తలొక రూపాయి వస్తుందని ఆశలు పెంచుకోగా అవన్నీ ఆవిరయ్యాయి. జిల్లా వ్యాప్తంగా దాదాపు 350 మంది కొత్తగా తమ చిన్న మొత్తాలను ఈరూపంలో పెట్టుబడి పెట్టి చేతులు కాల్చుకున్నారు. సిండికేట్‌లలో ఉన్న కొందరు తమ అదృష్టానికి తిరుగులేదని భావించి మరీ పదుల సంఖ్యలో దరఖాస్తులు చేసుకోగా వారికి షాక్ తగిలింది.

ప్రశాంతంగా లక్కీడిప్ : కలెక్టర్

ఏలూరు క్రైం : జిల్లాలో మద్యం దుకాణాల కేటాయింపు లక్కీడిప్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసిందని కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. లాటరీ ముగిసిన తర్వాత కలెక్టర్ మాట్లాడుతూ.. 'జిల్లాలో ప్రశాంతంగా పారదర్శకంగా మద్యం దుకాణాల కేటా యింపు లక్కీడిప్ ప్రక్రియ పూర్తయింది. పూర్తి ప్రక్రియను వీడియోగ్రాఫ్ చిత్రీకరించాం. షాపులకు దరఖాస్తు చేసిన వారి సమక్షంలోనే లక్కీడిప్ తీసి దక్కించుకున్న వారి పేరు ప్రకటించా' మని తెలిపారు. ఎక్సైజ్‌శాఖ డిప్యూటీ కమిషనర్ బి.శ్రీలత, జేసీ ధాత్రిరెడ్డి, ఏలూరు జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎ.ఆవులయ్య, అదనపు ఎస్పీ ఎన్.సూర్యచంద్రరావు, ఇన్‌చార్జి డీఆర్వో దేవకి దేవి, ఏలూరు ఆర్డీవో అచ్యుత్ అంబరీష్, ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్ పలువురు అధికారులు పాల్గొన్నారు.

లాటరీ ప్రక్రియ.. పటిష్ఠ బందోబస్తు

మద్యం షాపుల లాటరీ ప్రక్రియలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు చర్యలను పోలీసులు చేపట్టారు. జిల్లా ఎస్పీ కేపీఎస్ కిశోర్ ఆదేశాలతో ఏలూరు డీఎస్పీ శ్రావణ్ కుమార్ ఆధ్వర్యంలో చలసాని గార్డెన్స్ వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. మినీబైపాస్ రోడ్డులో ఇరు వైపులా వాహనాల రాకపోకలను నిలిపివేశారు. కేవలం మద్యం షాపులకు దరఖాస్తు చేసిన వారికి సంబంధించిన వారిని మాత్రమే అనుమతించారు. పా ర్కింగ్‌కు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకున్నారు. ఎస్పీ స్వయంగా పరిశీలించి పోలీసు అధికారులకు ఆదేశాలిచ్చారు.